


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 54, పేజీలు - 08

సోమవారం, జులై 28, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్ కౌంటర్

**- నలుగురు మావోల మృతి, భారీగా ఆయుధాలు స్వాధీనం**



ఛత్తీస్‌గఢ్ (ప్రశ్న న్యూస్) ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. మృతులపై మొత్తం రూ. 17 లక్షల రివార్డు ఉంది. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ దళాలు బాసగూడ, గంగలూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దక్షిణ-పశ్చిమ కారిడార్‌లో మావోయిస్టుల

2లో..

## రాజీనామాపై మరోసారి స్పందించిన రాజాసింగ్

**-తన రాజీనామా వెనుక ఎలాంటి కుట్రలేదని వెల్లడి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇటీవలే బీజేపీకి రాజీనామా చేయడం తెలిసిందే. బీజేపీ హైకమాండ్ చెబితే, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని వెల్లడించారు. తాజాగా ఆయన తన రాజీనామాపై మరోసారి

2లో..

## సరోగసి పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్

**- 90వేలకు శిశువును కొని 40లక్షలకు అమ్మకం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) యూనివర్సల్ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. డిసిపి రష్మీ పెరుమాళ్ ఈ కేసులో అనేక కీలక విషయాలను వెల్లడించారు. అక్రమ సరోగసి ద్వారా చైల్డ్ ట్రాఫికింగ్ జరిగినట్టు పేర్కొన్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లో అక్రమ సరోగసి చేసినట్టు

2లో..

## స్పేస్ రంగంలో 200లకు పైగా స్టార్టప్‌లు

***- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ***



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అంతరిక్షం నుంచి తిరిగి వచ్చిన వ్యోమగామి శుభాన్షు శుక్లాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ప్రజలు ఆనందంతో గంతులు వేశారని, శుభాంశు శుక్లా కారణంగా భారతదేశం అంతటా పిల్లల్లో అంతరిక్షం పట్ల కొత్త ఉత్సుకత పెరిగిందన్నారు. నేడు అంతరిక్ష రంగంలోనే 200లకు పైగా స్టార్టప్‌లు వచ్చాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ 124వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు అంశాలను ప్రస్తావించారు. ఆగస్టు 23వ తేదీన నేషనల్ స్పేస్ డే సందర్భంగా ప్రజలు సలహాలు, సూచనలు

2లో..



# కేటీఆర్ వ్యూహం బెడిసి కొట్టిందా.?

## - అటు.. ఇటు తిరిగి ఇరకాటంలో పడ్డారా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిస్థితి మయసభలో దుర్యోధనుడి తరహాలో మారినట్లు కనపడుతుంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత ఏల ఇరుక్కోవలె? ఇరుక్కుంటిమి పో.. తీహార్ జైలుకు ఎందుకు వెళ్లవలె.. వెళ్లితిమి పో.. తాను ఎందుకు ఢిల్లీకి ఎందుకు వెళ్లవలె.. వెళ్లినితిని పో.. బెయిల్ పై న్యాయవాదులతో చర్చించకుండా బీజేపీ నేత సీఎం రమేష్ నాయుడును ఎందుకు కలవవలె? కలసినితిని పో.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేస్తానన్న ప్రతిపాదన ఎందుకు తేవలె.. తెచ్చితిని పో.. హెచ్.సి.యూ భూములపై రేవంత్ రెడ్డి పై కోపంతో రమేష్ పేరు ఎందుకు ప్రస్తావించవలె.. ప్రస్తావించితినిపో.. ఫోర్త్ సిటీ కాంట్రాక్టు పనులను ఏల ప్రజల ముందుంచవలె.. హతవిధీ.. ఇప్పుడు అటు ఇటు తిరిగి బీజేపీతో విలీనం పై రచ్చ ఏల జరగవలె.. అన్నట్లుంది కేటీఆర్ వ్యవహారం.

### బండి సంజయ్ ఎంట్రీతో..

సీఎం రమేష్ నాయుడు, కేటీఆర్ మధ్య జరుగుతున్న వివాదంలో ఇప్పుడు కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ఎంట్రీ ఇచ్చారు. ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇప్పుడు అసలు సమస్య పక్క దారి పట్టి బీజేపీతో బీఆర్ఎస్ విలీనం మాత్రమే హైలెట్ అవుతుంది. వాస్తవానికి హెచ్.సి.యూ భూమి వివాదంలో సీఎం రమేష్ రేవంత్ రెడ్డికి సహకరించారన్నది కేటీఆర్ ఆరోపణ.

అదే సమయంలో ఫోర్త్ సిటీలో 1600 కోట్ల రూపాయల పనులను సీఎం రమేష్ కు అప్పగించారన్న సెంటిమెంట్ తో పార్టీకి కొంత హైప్ తేవాలనుకున్నారు. కానీ రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో కామ్ గా ఉన్నప్పటికీ ఇది బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ గా మారిపోయినట్లు కనపడుతుంది.

### అసలు విషయం పక్కదారి పట్టి..

అసలు విషయం పక్క దారి పట్టి బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రతిపాదన మాత్రమే హైలెట్ గా నిలిచింది. నాడు కవిత అరెస్టయినప్పుడు ఢిల్లీకి వెళ్లిన కేటీఆర్ ఈ ప్రతిపాదన తెచ్చారన్నది సీఎం రమేష్ ఆరోపణ. అదే సమయంలో తాను అంతటి వాడిని కానని, చెల్లెలుతో వచ్చిన విభేధాలు తనపై ఆరోపణలు చేయడానికి కారణమయ్యారని అంటున్నారు.మరొకవైపు కవిత కూడా కేసీఆర్ కు రాసిన బహిరంగ లేఖలో బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రస్తావన తేవడాన్ని బీజేపీ నేతలు గుర్తు చేస్తున్నారు. మరొకవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా చేసిన వ్యాఖ్యలతో బీఆర్ఎస్ విలీనం హైలెట్ అవుతుంది. కేసీఆర్ కేటీఆర్ కు సిరిసిల్ల టిక్కెట్ ఇవ్వలేదని, అయితే కేటీఆర్ వెళ్లి సీఎం రమేష్ ను కలిశారన్నారు. సీఎం రమేష్ చెప్పబట్టే సిరిసిల్ల టిక్కెట్ కేసీఆర్ ఇచ్చాడన్న బండి సంజయ్ సిరిసిల్ల లో నాడు గెలిచేందుకు కేటీఆర్ కు సీఎం రమేష్ ఆర్థిక సాయం చేసిన మాట కూడా వాస్తవమేనని అన్నారు.

2లో..

## కేటీఆర్ గురించి సీఎం రమేశ్ చెప్పింది నిజమే

***- సీఎం రమేశ్ తో కేటీఆర్ చర్చకు సిద్ధంగా ఉండాలన్న బండి సంజయ్***



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలు నిజమేనని, సిరిసిల్ల టికెట్ రావడానికి సీఎం రమేశ్ కేటీఆర్‌కు ఆర్థికంగా సాయం చేశారని, దాని వల్లే కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యారని బండి సంజయ్ అన్నారు. సీఎం రమేశ్ తో చర్చకు సిద్ధంగా ఉండాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కరీంనగర్‌లో చర్చకు వేదిక తానే ఏర్పాటు చేస్తానని, మధ్యవర్తిత్వం కూడా వహిస్తానని చెప్పారు. కేటీఆర్ వాడిన భాషను తీవ్రంగా తప్పుబట్టిన బండి సంజయ్, కేటీఆర్ భాషను మార్చుకోవాలని,

2లో..

## సింగపూర్ పెట్టుబడులకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్

- డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీలో విస్తృత అవకాశాలు
- సింగపూర్‌లో భారత హై కమిషనర్‌తో భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సింగపూర్‌లో సీబీఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న హైకమిషనర్ శిల్పక్ ఆంబులే
- ఏపీలో పెట్టుబడులకు సింగపూర్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నట్టు వెల్లడి



సింగపూర్ / అమరావతి (ప్రశ్న న్యూస్) పోర్టులు, గ్రీన్ ఎనర్జీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. భారత్‌లో సింగపూర్ పెట్టే పెట్టుబడులకు గేట్ వేగా ఆంధ్రప్రదేశ్ ఉంటుందన్నారు. సింగపూర్ కు చెందిన కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రోగ్రెసివ్ పాలసీలు అమల్లో ఉన్నాయని తెలిపారు. సింగపూర్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుతో సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ ఆంబులే మర్యాదపూర్వకంగా భేటీ

2లో..

## ఎరువుల కొరతపై మంత్రి తుమ్మల చర్చకు సిద్ధమా?

**- బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇతరులపై నిందులు వేస్తోందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. ఎరువులను దళారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆరోపించారు ఆదివారం ఆయన గద్వాలలో పర్యటించారు. గద్వాల ప్రజలతో తనకు విశేషమైన అనుబంధం ఉందని అన్నారు. గతంలోనే అనేకసార్లు గద్వాలను సందర్శించానని, ఇప్పుడు కూడా జిల్లాల వారీగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు.


### రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన మద్దతు అందడం లేదు

గద్వాల జిల్లా కాటన్ సీడ్ ఉత్పత్తిలో కీలకంగా నిలుస్తోందని రాంచందర్ రావు అన్నారు. కానీ ఇక్కడ రైతులకు సాగునీటి సదుపాయం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన మద్దతు అందడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి

2లో..

## కర్మభూమిలో ఎదగండి.. జన్మభూమి కోసం నిలవండి

**సింగపూర్ లో తెలుగువారికి చంద్రబాబు పిలుపు**



సింగపూర్ / అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన తొలిరోజున ఏపీఎన్ఆర్ టీ భాగస్వామ్యంతో ఏర్పాటైన తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగపూర్ తో పాటు, పొరుగున్న మరో ఐదు దేశాల నుంచి తెలుగు ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావడంతో చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరంగా ప్రసంగించారు. "సింగపూర్ దేశం అంటే నాకు చాలా అభిమానం, గౌరవం. నీతి, నిజాయతీలకు సింగపూర్ దేశం నిలువెత్తు నిదర్శనం. ఈ దేశంలో అవినీతి తక్కువ. సింగపూర్ రోడ్ల మీద ఒక్క కాగితం ముక్క కూడా కన్పించదు. చాలా కాలం క్రితమే చెత్తను కూడా ఎనర్జీగా కన్వెర్ట్ చేసే విధానాన్ని సింగపూర్ ఆచరణలో పెట్టింది. అదే తరహా విధానాన్ని హైదరాబాద్ నగరంలో

2లో..

## గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు

***- సుమోటోగా తీసుకోవాలని హరీష్ రావు విజ్ఞప్తి***



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నాగర్ కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి కలుషితాహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థినిలను మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. గురుకులాల్లో జరుగుతున్న

2లో..

## రెండు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

**- ఏర్పాట్లు ముమ్మరం చేసిన అధికారులు - కొత్త ఓటర్ల జాబితా తయారీ**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది. గతంలో మూడు దశల్లో జరిగిన ఎన్నికలు జరగ్గా ఈసారి రెండు దశల్లోనే ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఎన్నికల సంఘానికి తెలిపింది. దీనికి అనుగుణంగా అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని సీఈఓలు, డీపీవోలకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సుల లభ్యత, కేటాయింపులను సమీక్షించాలని, ఏదైనా అదనపు

3లో..

## రీజినల్ రింగ్ రైల్వే లైన్ ప్రాజెక్ట్‌లో కీలక అడుగు

**-50 మీటర్ల మేర భూసేకరణ - హైదరాబాద్ చుట్టూ భారీ అభివృద్ధికి మార్గం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆర్థిక వృద్ధికి సూపర్ గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు వెంబడే రీజినల్ రింగ్ రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. సుమారు 400 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే లైన్ ఏర్పాటుతో హైదరాబాద్

3లో..

## రేషన్ కార్డుదారులకు షాక్

**- ఆ జిల్లాలో అనర్హులుగా 92,135 మంది**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా రేషన్ కార్డులు జారీ చేసింది. అయితే.. ఈ జారీ ప్రక్రియలో కొన్ని తప్పిదాలు జరిగాయని, దీనివల్ల అనర్హులకు కార్డులు మంజూరయ్యాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ గుర్తించింది. గత రెండు నెలలుగా బియ్యం పంపిణీలో జాప్యం కూడా జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించింది. ఈ చర్య ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

2లో..

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్ కౌంటర్

కార్యకలాపాలపై నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు ఆపరేషన్ ప్రారంభించాయి. శనివారం సాయంత్రం ప్రారంభమైన కాల్పులు రాత్రంతా అడపాదడపా కొనసాగాయి. మృతి చెందిన మావోయిస్టులను హుంగా, లక్కె , భీమే, నిహాల్ అలియాస్ రాహుల్ గా గుర్తించారు. వీరంతా నిషేధిత సీపీఐ (మావోయిస్టు) సౌత్ సబ్ జోనల్ బ్యూరోకు చెందినవారని అధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి భద్రతా సిబ్బంది భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, ఒక ఇన్‌సాస్ రైఫిల్, ఒక .303 రైఫిల్, ఒక 12 బోర్ గన్, ఒక బీజీఎల్ లాంచర్, ఒక సింగిల్ షాట్ 315 బోర్ రైఫిల్, ఒక ఏకే-47 ఉన్నాయి. అనేక మ్యాగజీన్‌లు, లైవ్ రౌండ్లు, గ్రనేడ్‌లు, బీజీఎల్ సెల్‌లు, మావోయిస్టు సాహిత్యం, నిత్యావసర వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నారు.

# రాజీనామాపై మరోసారి స్పందించిన రాజాసింగ్

స్పందించారు. తన రాజీనామా వెనుక ఎలాంటి కుట్ర లేదని స్పష్టం చేశారు. ఎవరి వల్ల పార్టీకి డ్యామేజి జరిగిందో, ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానానికి చెప్పడానికి ప్రయత్నించానని వెల్లడించారు. లక్షల మంది కార్యకర్తలు బీజేపీ కోసం తమ జీవితాలను త్యాగం చేశారని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఒక యోధుడు కావాలి అని అన్నారు. కేంద్రమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా తనకు ఫోన్ చేయలేదని, ఆయన ఫోన్ చేసేంతటి పెద్ద వ్యక్తిని కానని రాజాసింగ్ అన్నారు. తాను మళ్లీ బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నానని, అందుకే కార్యకర్తల బృందాన్ని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పంపానని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని రాజాసింగ్ స్పష్టం చేశారు. తాను అన్ని విధాలుగా ఆలోచించిన తర్వాతే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

# సరోగసి పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్

తెలిపిన నార్త్ జోన్ డిసిపి రష్మీ పెరుమాళ్ ఈ కేసులో పిల్లల అమ్మకాల రాకెట్ ను చేదించినట్టు తెలిపారు. ఈ కేసు వివరాలను వెల్లడించిన నార్త్ జోన్ డిసిపి 2024 ఆగస్టులో సంతానం కోసం ఒక జంట యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ను ఆశ్రయించారని, డాక్టర్ నమ్రత వారికి సరోగసి చేయించుకోవాలని సూచించారని తెలిపారు. సరోగసి ద్వారా పిల్లలను కనడానికి తమ క్లినిక్ సహాయం చేస్తుందని చెప్పగా, దీనికోసం దంపతులు 9నెలలపాటు క్లినిక్ డబ్బులు చెల్లించారు. సరోగసి ద్వారా జూన్ 2025లో విశాఖపట్నంలో ఒక మగ శిశువు జన్మించాడు.డెలివరీ చార్జీలు చెల్లించి బిడ్డను తీసుకువెళ్లాలని ఆ దంపతులకు డాక్టర్ నమ్రత సూచించారు. వారికి బిడ్డను అప్పగించి, తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాన్ని, డిఎన్ఏ నివేదికను కూడా వారికి అందించారు. సంతానం లేని భార్యాభర్తల అండం, వీర్యం ద్వారానే బిడ్డ పుట్టినట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ ప్రక్రియలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఆ జంట నుండి 35 లక్షలకు పైగా వసూలు చేసింది. ఆ తర్వాత బిడ్డ డిఎన్ఏ ను వారు పరీక్షించగా, వారి డిఎన్ఏ తో సరిపోలేదు. దీంతో మోసపోయినట్టు గుర్తించిన ఆ జంట పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి, డాక్టర్ నమ్రతను అరెస్టు చేసి విచారణ చేపట్టగా ఆ ఫెర్టిలిటీ సెంటర్ లో జరుగుతున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి.డాక్టర్ నమ్రత సరోగసి ద్వారా పిల్లలను పుట్టిస్తానని చెప్పి ప్రతి క్లైంట్ నుండి 20నుండి 30లక్షల రూపాయల వరకు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ఈ జంటకు 90వేల రూపాయలిచ్చి కొనుగోలు చేసిన శిశువును 40లక్షలకు విక్రయించినట్టు తెలిపారు. సరోగసి ద్వారా బిడ్డలను పుట్టిస్తున్నానని చెప్పి చైల్డ్ ట్రాఫికింగ్ కు పాల్పడుతున్నారని డిసిపి రష్మీ వెల్లడించారు. లైసెన్సు లేకుండానే ఐవీఎఫ్ చికిత్సలు చేస్తున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. చిన్న పిల్లలను కొనుగోలు చేసి, సరోగసి ద్వారా పుట్టిన బిడ్డలని నమ్మిస్తూ డాక్టర్ నమ్రత మోసం చేస్తుందని పేర్కొన్నారు. గతంలో డాక్టర్ నమ్రతా పై విశాఖపట్నం టూ టౌన్ పిఎస్, మహారాణిపేట పిఎస్, గోపాలపురం పిఎస్, గుంటూరులోని కొత్తపేట పిఎస్ లలో కేసులు నమోదయ్యాయని గుర్తించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ రిజిస్ట్రేషన్ ను రద్దు చేసినట్టుగా తెలిపారు. అయినప్పటికీ నమ్రత మరో సర్టిఫైడ్ డాక్టర్ సూరి పేరును ఉపయోగించి ఈ దందా నిర్వహిస్తున్నట్లుగా డిసిపి రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. ఈ కేసులో 8 మంది ముఖ్య నిందితులను అరెస్ట్ చేసినట్టుగా తెలిపారు.

# స్పేస్ రంగంలో 200లకు పైగా స్టార్టప్‌లు పంపాలని ప్రధాని పిలుపునిచ్చారు.

### నమో యాప్ ద్వారా మీరు సలహాలు, సూచనలు పంపండి

'గత కొన్ని వారాలుగా స్పేస్, సైన్స్ రంగాల్లో విజయాల గురించి మనం మాట్లాడుతున్నాం. వ్యోమగామి శుభాంశు శుక్లా భూమిపైకి తిరిగి వచ్చారు. చంద్రయాన్-3 సక్సెస్ సమయంలోనూ దేశంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డే. ఈ సందర్భంగా నమో యాప్ ద్వారా మీరు సలహాలు, సూచనలు పంపండి' అని పేర్కొన్నారు.

### అనేక త్యాగాల ఫలితంగా నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకొంటున్నాం

ఈ సందర్భంగా స్వాతంత్ర్య మరయోధుడు ఖుదిరామ్ బోస్ గురించి ప్రస్తావించారు. '1908లో ముజఫర్పూర్లో ఓ యువకుడిని ఉరితీశారు. ఆ సమయంలో అతడి ముఖంలో భయం లేదు.. ఆత్మవిశ్వాసం ఉంది. అతడి పేరు ఖుదిరామ్ బోస్. వయసు 18 ఏళ్లు. దేశాన్ని కదిలించాడు. అలాంటి అనేక త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకొంటున్నాం' అని అన్నారు.

### స్వదేశీ ఉద్యమం స్థానిక ఉత్పత్తుల్లో బలం చేకూర్చింది

'ఆగస్టు నెల ఓ విప్లవ మాసం. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాడు స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకొంటాం. 1905 ఆగస్టు 7వ తేదీన సరికొత్త ఉద్యమం మొదలైంది. స్వదేశీ ఉద్యమం స్థానిక ఉత్పత్తుల్లో బలాన్ని చేకూర్చింది. ముఖ్యంగా వస్త్ర పరిశ్రమలో ఇది కనిపించింది. దానికి చిహ్నంగానే ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. వస్త్ర తయారీ రంగం దేశానికి అదనపు బలంగా మారింది. మహారాష్ట్ర నుంచి కవిత ధావ్లా, ఒడిశా నుంచి మయూర్భాంజ్, బిహార్ నుంచి నవీన్ కుమార్ చేనేతలో స్ఫూర్తిదాతలుగా ఉంటున్నారు'.

### అక్కడ 40 రకాల గడ్డి పక్షులు ఉన్నాయి

'భారతదేశం ఒలింపిక్స్ మరియు ఒలింపియాడ్ కోసం ముందుకు సాగుతోంది. మహారాష్ట్రలో 12 కోటలు ప్రపంచ వారసత్వ సంపదగా యూనెస్కో గుర్తించింది. కొన్నేళ్ల క్రితం రాయగడ్కు వెళ్లాను. ఆ పర్యటన నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. మీకు తెలిసిన పక్షుల గురించి అడిగితే, మీరు 4-5 జాతుల పక్షుల గురించి చెబుతారు. కానీ అస్సాంలోని కజిరంగా నేషనల్ పార్క్లో గడ్డి భూమి పక్షులకు నిలయం. అక్కడ 40 రకాల గడ్డి పక్షులు ఉన్నాయి. వాటి కూతల ఆధారంగా ఏఐ గుర్తించింది. టెక్నాలజీ, సెన్సివిటీ కలిస్తే ప్రతిదీ తేలిక అవుతుంది' అని ప్రధాని మోదీ మన్ కీ బాత్లో మాట్లాడారు.

# కేటీఆర్ వ్యూహం బెడిసి కొట్టిందా.?

సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలో నిజముందన్నారు.

### కేటీఆర్ మాత్రం..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. సీఎం రమేష్ , సీఎం రేవంత్ ఇద్దరూ కలిసి వస్తే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటలో జరిగిన పదవి వేల కోట్ల కుంభకోణంపైనా, ఫ్యూచర్ సిటీలో ఇచ్చిన రూ.1660 కోట్ల రోడ్ కాంట్రాక్ట్ స్కాంపై రెండింటిపైనా కలిసి చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు.

10 వేల కోట్లు దోచుకునేందుకు సహకరించినందుకు సీఎం రమేష్ కు రేవంత్ రెడ్డికి ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ గా1660 కోట్ల కాంట్రాక్ట్ అని అన్నారు. ఎప్పటికీ బీఆర్ఎస్ ఏ పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదని, తెలంగాణ ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటుందని కేటీఆర్ చెబుతున్నాఅసలు చర్చ మాత్రం విలీనం పైనే జరుగుతుంది. మరి కేటీఆర్ చేస్తున్న విమర్శలు ఆయనకే రాజకీయంగా బూమరాంగ్ అవుతున్నాయా? అన్న అనుమానం బీఆర్ఎస్ నేతల్లో కలుగుతోంది. ఇప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విలీనంపైనే ఎక్కువగా వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది.

# కేటీఆర్ గురించి సీఎం రమేశ్ చెప్పింది నిజమే

లేదంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీఆర్ఎస్‌ను "తండ్రి, కొడుకు, అల్లుడు" పార్టీగా అభివర్ణించిన బండి సంజయ్, బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిందని, బీజేపీలో విలీనం అయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కంచ గచ్చిబౌలి భూములు, ఓ రోడ్ కాంట్రాక్టు విషయంలో కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేయగా సీఎం రమేశ్ అంతకు రెట్టింపు స్థాయిలో స్పందించడం తెలిసిందే. ఎన్నికల్లో కేసీఆర్ టికెట్ ఇవ్వకపోతే, కేటీఆర్ తన వద్దకు వచ్చి వాపోయాడని సీఎం రమేశ్ వెల్లడించారు. దాంతో తాను జోక్యం చేసుకుని కేటీఆర్ కు టికెట్ ఇప్పించానని సీఎం రమేశ్ సంచలన ఆరోపణలు చేశారు. ఇది నిజం కాదని కేటీఆర్ చెప్పగలరా? అని సవాల్ విసిరారు.

# సింగపూర్ పెట్టుబడులకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్

అయ్యారు.

### ఏపీలో పెట్టుబడులకు సింగపూర్ ప్రత్యేక ఆసక్తి

సింగపూర్ ప్రభుత్వంలో, పారిశ్రామిక వేత్తల్లో సీబీఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని భారత హై కమిషనర్ సీఎం చంద్రబాబుకు తెలిపారు. వివిధ రంగాల్లో సింగపూర్ సాధించిన ప్రగతి, వృద్ధి, ఆ దేశంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పాలసీలు, సింగపూర్‌లో భారతీయుల కార్యకలాపాల గురించి భారత హై కమిషనర్ సీఎంకు వివరించారు. ఆరోగ్య రంగం, గ్రీన్ హైడ్రోజన్, ఏవియేషన్, సెమి కండక్టర్స్, పోర్టులు, పారిశ్రామిక రంగాల్లో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలపై తెలియజేశారు. భారత్‌తో సింగపూర్ ప్రభుత్వం మంచి సంబంధాలను కలిగి ఉందని శిల్పక్ అంబులే వివరించారు. భారత్‌లో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని భారత హైకమిషనర్ ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ గతంలో సింగపూర్‌తో కలిసి అమరావతి ప్రాజెక్టును చేపట్టామని కొన్ని కారణాల వల్ల రాజధాని ప్రాజెక్టు నుంచి సింగపూర్ వైదొలిగిందన్నారు.2019-24 మధ్య జరిగిన పరిణామాలు దీనికి కారణమయ్యాయన్నారు. ప్రస్తుతం తన పర్యటనలో గతంలో జరిగిన అపోహల్ని తొలగించి రికార్డులను సరిచేసేందుకు ప్రయత్నిస్తానని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాగే ఏపీలో వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పాలసీలను, అవకాశాలను భారత హై కమిషనర్‌కు సీఎం వివరించారు.

ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే విశాఖలో ఎన్టీపీసీ, కాకినాడలోనూ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు పట్టాలెక్కాయని సీఎం వివరించారు. అలాగే ఇండియా క్వాంటం మిషన్‌లో భాగంగా అమరావతిలో తొలి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయనున్నట్టు సీఎం తెలియజేశారు. విశాఖలో దిగ్గజ ఐటీ కంపెనీ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని స్పష్టం చేశారు.

### ఏపీలో పెట్టుబడులకు సహకారం అందించాలి

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకించి రాయలసీమలో డిఫెన్సు, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సంస్థలు ఏర్పాటు చేసేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. సింగపూర్ నుంచి భారత్‌కు పెట్టుబడులు రావాలని దీనికి ఏపీ గేట్ వేగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఏపీలో పెట్టుబడులకు అవసరమైన సహకారాన్ని అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. మరోవైపు సింగపూర్‌లో 83 శాతం మేర పబ్లిక్ హౌసింగ్ ప్రాజెక్టులు ఉన్నాయని భారత హై కమిషనర్ వివరించారు. దీనిపై ఏపీలో చేపడుతున్న హౌసింగ్ ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణ వివరించారు. విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, భవిష్యత్ ఆలోచనల్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ భారత హై కమిషనర్‌కు వివరించారు. ఏపీలో ఇప్పటికే ఏర్పాటు అవుతున్న ప్రముఖ విద్యా సంస్థల గురించి తెలిపిన మంత్రి ఏపీకి త్వరలో తరలివచ్చే ప్రతిష్టాత్మక విద్యా సంస్థల ఏర్పాటుకు సిద్దంగా ఉన్నామని స్పష్టం చేశారు.

### ఏపీ టెక్ నిపుణులకు ప్రత్యేక డిమాండ్

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టెక్ నిపుణులకు ఆగ్నేయాసియాలో ప్రత్యేకించి సింగపూర్‌లో డిమాండ్ ఉందని భారత హై కమిషనర్ సీఎంకు వివరించారు. అమెరికా తరహాలోనే ఆగ్నేసియాలోని సింగపూర్ లాంటి దేశాల విద్యార్థుల్ని, టెక్ నిపుణుల్ని ఆకర్షిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ అంశంపై సింగపూర్‌లోని భారత రాయబార కార్యాలయం ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని ముఖ్యమంత్రికి తెలియచేశారు. సింగపూర్ నుంచి ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి ఆయన వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల ఉత్పత్తి, షిప్ బిల్డింగ్, పోర్టు కార్యకలాపాల నిర్వహణ, డేటా సెంటర్ల ఏర్పాటు, ఫార్మా తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని సీఎంకు వివరించారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆసియా పసిఫిక్ దిగ్గజ కంపెనీలు ఎస్టీటీ, కెప్పెల్, కాపిటాల్యాండ్, ఈక్వినిక్స్, పీఎస్ఏ తదితర సంస్థల విస్తరణకు అవకాశాలు ఉన్నట్టు వెల్లడించారు. ఏఐ, స్టార్టప్‌లు, వైద్య పరికరాల రంగంలో పరిశోధన, ఏపీ, సింగపూర్ యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యం కుదుర్చుకునే అంశంపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఎరువుల కొరతపై మంత్రి తుమ్మల చర్చకు సిద్ధమా?

ఇతరులపై నిందలు మోపుతోందని మండిపడ్డారు.

### నీమ్ కోటెడ్ యూరియాను అందుబాటులోకి తెచ్చాం

యూపీఏ పాలనలో రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి క్యూలైన్లలో నిల్చోవాల్సి వచ్చేదని, అప్పట్లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. క్యూలైన్లలో పోలీసులు లాఠీచార్జ్‌లు చేసేవారని అన్నారు. కానీ మోదీ ప్రభుత్వం వచ్చాక, నీమ్ కోటెడ్ యూరియాను అందుబాటులోకి తెచ్చిందన్నారు.

### 2.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా ఇచ్చాం

తెలంగాణకు అవసరమైన 9.5 లక్షల మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువగా, 12.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం సరఫరా చేసిందని బీజేపీ అధ్యక్షుడు వెల్లడించారు. ఇది అవసరానికి మించి 2.5 లక్షల మెట్రిక్ టన్నులు అదనం అని అన్నారు.

అయినప్పటికీ రాష్ట్రంలో యూరియా కొరత ఉందంటూ కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 'రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిసినప్పుడు తెలంగాణకు అవసరమైన యూరియాను కేంద్రం పూర్తిగా పంపిణీ చేస్తోందని చెప్పారు. తెలంగాణకు కేంద్రం అవసరమైన మేరకు యూరియా పంపుతున్నప్పటికీ మార్కెట్‌లో యూరియా కొరత ఎందుకు ఏర్పడింది? దీనిపై దర్యాప్తు చేయాలని కూడా రేవంత్ రెడ్డిని కోరాము. రాష్ట్ర ప్రభుత్వం దళారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలేలా ప్రోత్సహిస్తోంది. ఈ ప్రభుత్వం రైతులను తప్పుదారి పట్టిస్తూ కేంద్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తోంది. కానీ అసలు కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం' అని విమర్శించారు.

### తుమ్మల నాగేశ్వరరావు చర్చకు సిద్ధమా?

దేశంలో ఎక్కడా లేని విధంగా ఎరువుల కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తోందని ప్రశ్నించిన రాంచందర్ రావు.. ఈ అంశంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'కాంగ్రెస్ పార్టీ ఎరువుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. రైతుల జీవితాలతో చెలగాటమాడింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీయాలి. ఎరువులు ఎక్కడికి పోయాయని ప్రశ్నించాలి' అని అన్నారు.

# రేషన్ కార్డుదారులకు షాక్

నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడటం లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

### ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భారీ ఏరివేత

ఈ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,027 రేషన్ దుకాణాల పరిధిలో పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖాధికారులు సంయుక్తంగా ఏరివేత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కొత్తగా జారీ చేసిన కార్డులతో పాటు, గతంలో ఉన్న పాత కార్డులను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అధికారుల ప్రాథమిక పరిశీలనలో.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు జిల్లాల పరిధిలో 92,135 మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించారు. ప్రతి రేషన్ కార్డులోని లబ్ధిదారుల పేర్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. వారం రోజులుగా ఈ పరిశీలన ప్రక్రియ చాలా వేగంగా జరుగుతోంది. ఇప్పటి వరకు గుర్తించిన అనర్హుల వివరాలను ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. రేషన్ దుకాణాల డీలర్ల నుండి లబ్ధిదారుల పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. అంతే కాకుండా గత ఆరు నెలల నుంచి రేషన్ తీసుకోని వారి పేర్లను కూడా అనర్హుల జాబితాలో చేర్చడమే కాకుండా రేషన్ కార్డులను రద్దు కూడా చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,60,537 రేషన్ కార్డులు ఉండగా వాటి ద్వారా 33,65,854 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారు.

అయితే ఈ కార్డులలో చాలా మంది పెళ్లయి ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన వారు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఇంకా నమోదై ఉన్నాయి. అలాంటి వారికి కూడా ప్రతినెలా బియ్యం పంపిణీ జరుగుతూ ఉండటం సమస్యకు దారితీసింది. ఈ సమస్యకు ప్రధాన కారణం బియ్యం పంపిణీ విధానంలో ఉన్న లొసుగులు. రేషన్ కార్డులోని కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒక్కరు వేలిముద్ర వేసినా బియ్యం పంపిణీ చేస్తారు. కుటుంబ సభ్యులంతా వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదు.

దీంతో, కార్డులో చనిపోయిన వారు, పెళ్లయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు ఉన్నప్పటికీ, వారి పేరున కూడా బియ్యం తీసుకునే అవకాశం ఏర్పడింది. ఈ లోపాన్ని సరిచేయడానికి, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే రేషన్ అందేలా చూడటానికి ప్రభుత్వం ఈ ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రక్షాళన ద్వారా ప్రభుత్వ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టి, అర్హులైన పేదలకు మాత్రమే ప్రయోజనాలు చేరేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతుందని తెలిపారు. కార్డులోని ప్రతీ లబ్ధిదారుని వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

# కర్మభూమిలో ఎదగండి.. జన్మభూమి కోసం నిలవండి

అమలు చేశాను. చాలా మంది రాజకీయ నేతలు సింగపూర్ వచ్చి ఎంజాయ్ చేసి వెళతారు. కానీ ఏపీ సీఎం మాత్రం ఇక్కడికి వచ్చి తాను చేసిన మంచి పనులను అమలు చేస్తున్నారని సింగపూర్ దేశ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ చెప్పారు. ఇలాంటి సింగపూర్ ప్రభుత్వంతో ఏపీకి గ్యాప్ వచ్చింది.నేను అడిగిన వెంటనే ఉచితంగా అమరావతి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి సింగపూర్ ప్రభుత్వం అంగీకరించింది. సింగపూర్ ప్రభుత్వం చాలా దేశాల్లో టౌన్ షిప్ లు కట్టింది. కాబట్టి సీడ్ క్యాపిటల్ నిర్మాణం సింగపూర్ ప్రభుత్వానికే అప్పగించాను. కానీ 2019లో ప్రభుత్వం మారి సింగపూర్ ను తప్పు పట్టే పరిస్థితి తీసుకువచ్చారు. వాటిని సరిదిద్ది, రికార్డులు సరి చేయడానికే సింగపూర్ వచ్చాను. ఏపీ బ్రాండును సింగపూర్ లో తిరిగి నెలకొల్పడానికే వచ్చాను. మన రాష్ట్రంలో ఏ ఒక్కరు తప్పు చేసినా తెలుగు వాళ్లే చేశారంటారు. ఆ అభిప్రాయాన్ని సింగపూర్ ప్రభుత్వంలో, సింగపూర్ కంపెనీల్లో తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాను. సింగపూర్ కు కలిగిన అసౌకర్యానికి బాధపడుతున్నానని వారికి చెబుతున్నాను. సింగపూర్ ప్రభుత్వం మళ్లీ సీడ్ క్యాపిటల్ నిర్మాణానికి ముందుకు రాకపోవచ్చు. జరిగిన వాస్తవాలను మాత్రం వారికి తెలియచేస్తాను. 2019లో కూడా మన ప్రభుత్వమే కొనసాగి ఉంటే, అమరావతి సింగపూర్ స్థాయికి చేరేది. కానీ 2019 ఎన్నికల్లో గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇలాంటి పొరపాట్లు రాకుండా చూసుకోవాలి. ఈ బాధ్యత నా మీదే కాదు, మీ మీద కూడా ఉంది" అని చంద్రబాబు భావోద్వేగంగా స్పందించారు.

### పెట్టుబడులతో రండి

"గతంతో పోల్చుకుంటే ఇప్పుడు సాంకేతికంగా చాలా అంశాలు అందుబాటులోకి వచ్చాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీని అభివృద్ధి చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఏపీలో 20 పోర్టులు వస్తాయి, 15-20 ఎయిర్ పోర్టులకు అవకాశం ఉంది. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్, టాటా సంస్థలతో కలిసి పని చేస్తున్నాం. చాలా మంది తెలుగు వాళ్లు విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇలాంటి వారు తమ అనుభవాన్ని ఏపీకి అందించవచ్చు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించేందుకు నో పావర్టీ మిషన్ ప్రారంభించాను. మీ మీ గ్రామాల్లోని పేదలను దత్తత తీసుకోండి. విదేశాల్లో స్థిరపడిన తెలుగు వాళ్లు, పీ4లో భాగస్వాములుగా ఉంటే నాకు అంతకు మించిన ఆనందం వేరొకటి ఉండదు.

### ఏపీలో వెంకన్న ఉండడం మన అదృష్టం

"తిరుపతి బాలాజీ మన రాష్ట్రంలో ఉండడం అదృష్టం. ఎన్ని కష్టాలున్నా వేంకటేశ్వరస్వామిని తలుచుకుని సంకల్పం తీసుకుంటే సమస్య పరిష్కారమై పని అయిపోతుంది. ఎన్నార్టీలకు తిరుమల వెంకన్న దర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలి. సింగపూర్ నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖ, తిరుపతికి నేరుగా విమానాలు వచ్చేలా చేస్తాం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాం. సింగపూర్ లో బెంగాలీ, హిందీ, తమిళ్ రెండో భాషగా ఉన్నాయి. తెలుగు కూడా రెండో భాషగా పెట్టాలని కోరుతున్నాను. ఇక్కడే ఉన్న భారత హైకమిషనర్ ఈ మేరకు చొరవ తీసుకోవాలని కోరుతున్నాను" అని చంద్రబాబు చెప్పారు.

### సరైన నాయకుడు ప్రధాని మోదీనే

"ప్రస్తుతం భారత దేశానికి ప్రజలే ఆస్తి. గతంతో పోల్చుకుంటే ప్రపంచ వ్యాప్తంగా భారత దేశానికి గౌరవం పెరిగింది. ఈ సమయంలో దేశానికి సరైన నాయకుడుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్నారు. దేశంలో చాలా మంది ప్రధానులు, చాలా మంది సీనియర్ లీడర్లను చూశాను. రైట్ టైమ్, రైట్ ప్లేస్, రైట్ లీడర్ నరేంద్ర మోదీ. మోదీ మనకు పెద్ద వరం. అమెరికాకు చెందిన ఓ సంస్థ చేసిన సర్వేలో మోదీ ప్రపంచంలోనే పాపులర్ లీడరుగా నెంబర్-1 స్థానంలో నిలిచారు. ప్రధానికి 75 శాతం అప్రూవల్ రేటింగ్ ఉంది. దేశానికి గుర్తింపు, సుస్థిరత మోదీ వల్లే వచ్చింది. ఇలాంటి సమయంలో ఆకాశమే హద్దుగా దూసుకెళ్లాలి. నరేంద్ర మోదీ వికసిత్ భారత్ నినాదంతో వెళుతన్నారు. నేను స్వర్ణాంధ్ర సంకల్పంతో ముందుకెళుతున్నాను" అని అన్నారు.

# గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు

సంఘటనలపై సుమోటోగా కేసు స్వీకరించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రెండు చేతులు జోడించి అభ్యర్థిస్తున్నాను.

### కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్ల ఫుడ్ పాయిజన్

నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తినడం వల్ల 111 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల హాస్టళ్లలో సంఘటనలు జరగడం చాలా బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్ల, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ నేతలు వస్తున్న విషయం తెలుసుకొని హడావుడిగా పిల్లలను తీసుకొచ్చి హాస్పిటల్లో చేర్పించారు. కొందరు విద్యార్థులకు చేతికి క్యాండిల్ తోనే చెట్టు కింద కుర్చీలో కూర్చోబెట్టి చికిత్స అందిస్తున్నారు.పిల్లలకు మంచి భోజనం పెట్టకుండా, వారికి సరైన వైద్యం అందించకుండా అధికారులు ఎందుకు హడావిడిగా తీసుకొచ్చారు. తెలంగాణలో ఎక్కడ చూసినా ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయి. నాగర్ కర్నూలు జిల్లాలోనే మొన్న పెద్దకొత్తపల్లి హాస్టల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెంలలో కలుషిత ఆహారం తిని ఆసుపత్రిపాలయ్యారు. హుస్నాబాద్ బీసీ గురుకుల పాఠశాలలో ఎలుకలు కొరికి విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారు. ఏదోచోట గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆసుపత్రుల్లో చేరుతున్న వార్తలు చూడాల్సి వస్తోంది.

### 100 మంది విద్యార్థులు చనిపోయినా స్పందించని సీఎం

20 నెలల సీఎం రేవంత్ రెడ్డి పాలనలో వందమంది గురుకుల విద్యార్థులు చనిపోయారు. 100 మంది చనిపోయినా మీ గుండె కరగదా రేవంత్ రెడ్డి. గురుకుల విద్యార్థుల గురించి పట్టించుకోవా.? ఈ విద్యార్థుల భవిష్యత్తుపైన మీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా.? పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టడం ఈ ప్రభుత్వానికి చేతకాదా. బాలల దినోత్సవం నాడు ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ అయితే అధికారులను సస్పెండ్ చేస్తా అని రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికాడు. నువ్వే విద్యాశాఖ మంత్రివి. నీ సొంత జిల్లా మహబూబ్ నగర్ లో విద్యార్థులు ఆస్పత్రి పాలైతే కూడా స్పందించవా.

### అందాల పోటీల్లో లక్షకు ప్లేట్ భోజనం.. మరి గురుకులాల్లో పురుగుల అన్నం

అందాల పోటీల్లో లక్ష రూపాయలకు ప్లేట్ భోజనం పెట్టావు, అందాల భామలను చూడడానికి ఐదుసార్లు పోయావు. మరి అనారోగ్యానికి గురైన ఈ పిల్లలను చూడడానికి ఆసుపత్రికి రావడం లేదు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు ఆసుపత్రి పాలైతుంటే వాళ్ళని పరామర్శించాలని రేవంత్ రెడ్డికి ఎందుకు అనిపించదు. కేసీఆర్ ఆనవాళ్లు మారుస్తా అంటే ఏమిటి. ఆనవాళ్లు మార్చడం అంటే విద్యార్థులు గురుకుల నుండి టీసీలు తీసుకుని వెళ్లిపోవడమా.? ఆనవాళ్లు మార్చడం అంటే గురుకుల పిల్లలను ఆసుపత్రి పాలు చేయడమా? 284 గా ఉన్న గురుకులాలను కేసీఆర్ 1,023 గురుకులాలకు పెంచిండు. 1,60,000 మంది ఉన్న గురుకులాల్లో కేసీఆర్ ఆరు లక్షల మంది విద్యార్థులు చదివే సౌకర్యాలు కల్పించారు.

### రేవంత్ రెడ్డి గురుకులాలను ఆగం చేశాడు

ఇంటిగ్రేటెడ్ స్కూలు పెడతా అని డబ్బా కొట్టిన రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల్లో ఒక ఇటుక పెట్టింది లేదు. ఒక స్కూల్ కట్టింది లేదు. ఉన్న గురుకుల విద్యార్థులకు అన్నం పెట్టకుండా ఏడిపించే పరిస్థితి ఉంది. ఒక విద్యార్థిని తల్లి రూప అనే మహిళ నన్ను కలిశారు. వారు బండై గుట్ట గ్రామం కొల్లాపూర్ నుంచి వచ్చారు. నిన్న వారి బిడ్డ కలుషిత ఆహారం తిని ఆసుపత్రిపాలైందని తెలిసి వచ్చింది. ఆదివారం రోజు విద్యార్థులకు పెట్టవలసింది పూరి, చపాతి. కానీ ఉదయం పెట్టింది సాంబారు అన్నం. ఆ సాంబార్లో కూడా పురుగులు వచ్చాయని ఆ తల్లి స్వయంగా చూసి చెప్పింది.

గురుకులాల్లో మెనూ కూడా ఈ ప్రభుత్వం పాటించడం లేదు. ప్రతీరోజు ఏదో ఒక జిల్లాలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు అన్ని జిల్లాలో రోజుకి 100 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన సంఘటన ఆరు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేసి వారి జీవితాలతో రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నాడు. పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడకండి. బీఆర్ఎస్ మీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూస్తూ ఊరుకోదు. మళ్లీ గురుకుల బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం.

### సమగ్ర విచారణ జరపాలని హరీష్ రావు రిక్వెస్ట్

హ్యూమన్ రైట్స్ కమిషన్ వారు సుమోటోగా తీసుకొని రాష్ట్రంలో గురుకుల హాస్టల్స్ లో జరుగుతున్న సంఘటనలపై విచారణ చేయాలి.

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గారిని రెండు చేతులు జోడించి అభ్యర్థిస్తున్నాము, సుమోటోగా కేసు తీసుకోండి, బీసీ హాస్టల్లో ఇంకా బెడ్ షీట్స్ రాలేదు. కాస్మోటిక్ బిల్లులు రాలేదు. కొన్ని హాస్టల్లో ఇంకా విద్యార్థులకు బట్టలు కూడా రాలేదు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని హరీష్ రావు కోరారు.

# చర్లపల్లిలో అక్రమ నిర్మాణాల జోరు

## - అక్రమ నిర్మాణాలపై డిసి మౌనమేలా - టౌన్ ప్లానింగ్ ఏసీపి నిర్లక్ష్యంతో పుట్టగొడుగుల అక్రమ నిర్మాణాలు

కాప్రా(ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతుంది. పేదోళ్లు గూడు కట్టుకుంటే అందరికన్నా పడుతుంది. అధికారులు మొదలు స్థానిక నాయకులదాకా అనుమతులున్నాయా.? ఎక్కడినుంచి కడుతున్నారంటూ ఆరా తీస్తుంటారు. కానీ కాప్రా సర్కిల్ పరిధిలో మాత్రం సర్కారు ఖజానాకు గండికొడుతూ జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మిన్నకుండిపోతున్నారు. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ డిప్యూటీ కమిషనర్ జగన్, టౌన్ ప్లానింగ్ ఏసీపి కృష్ణమోహన్ యంత్రాంగం ఏం చేస్తోందంటూ స్థానికుల నుండి ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఎలాంటి అనుమతుల్లేకుండానే నిర్మాణాలు చేపడుతుండటం గమనార్హం. కొన్ని నిర్మాణాలు కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ లో ఎలాంటి ఇంటి అనుమతులు తీసుకోకుండా మూడంతస్తుల భారీ భవనం నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ కొంత ప్రాంతం యూఎల్సీ (అర్బన్ ల్యాండ్ సీలింగ్) ఉన్నందున సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదని అయినప్పటికీ కొంతమంది అధికారులకు లంచాలు ఇచ్చి ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. సదరు ప్రాంతంలో సర్కారు స్థల పరిధిని గుర్తించేవరకూ అనుమతులు ఇవ్వరాదని మున్సిపల్ అధికారులకు గతంలోనే కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అయిన అక్రమ నిర్మాణానికి ఎలాంటి అనుమతి లేకున్నా మూడంతస్తుల నిర్మాణాలు చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ఆఫీసర్లకు జేబులు ఫుల్, అంతా వారి కనుసన్నల్లోనే, బీఎన్ రెడ్డి నగర్ లో ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న నిర్మాణం అడ్డూఅదుపూ లేకుండా పోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమను అడిగే నాథుడే లేడని భావిస్తున్నారో ఏమోగానీ అనుమతు ల్లేవని ప్రశ్నించినవారిని బెదిరింపులకు గురిచేస్తు న్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇంటి నిర్మాణాలు చేపడితే ఏ చిన్న లోపం జరిగినా కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణ చర్యలకు దిగడం పరిపాటే.. బి.యన్.రెడ్డి నగర్ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా సాగుతోంది. జీహెచ్ఎంసీ నుంచి ఇంటి అనుమతుల్లేకుండానే మూడంతస్తులు ఎలా వెలుస్తున్నాయంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడ నిర్మాణాలను సర్కిల్ ఉన్నత అధికారుల హస్తం ఉందని అక్రమ నిర్మాణదారుల నుండి అధికారులకు లక్షల రూపాయలు ముడుపులు ముట్టాయని అందుకే వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కట్టడాలకు అధికారులే సలహాదారులుగా ఉంటున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో డిప్యూటీ కమిషనర్ జగన్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, గ్రేటర్ కమిషనర్ కాప్రా సర్కిల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై దృష్టిసారించి, ప్రభుత్వ ఖజానాకు గండిపడకుండా చూడాలని, అవినీతి కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రీజినల్ రింగ్ రైల్వే లైన్ ప్రాజెక్ట్‌లో కీలక అడుగు

చుట్టూ ఉన్న ప్రాంతాల్లో రవాణా, వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని అంచనా వేస్తున్నారు. రీజినల్ రింగ్ రైల్వే లైన్ రాష్ట్రానికి ఎంతో కీలకమని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. ఆర్ఆర్ఆర్ వెంబడి రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా ఈ ప్రాజెక్టును సమర్థించారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేయడంతో, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హైదరాబాద్ పర్యటనలో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని రైల్వే జీఎంను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ వెంబడే రైల్వే లైను వచ్చే విధంగా చూడాలని సూచించారు.కేంద్ర మంత్రి ఆదేశాల నేపథ్యంలో రైల్వే జీఎం రాష్ట్ర రవాణా, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో రెండుసార్లు సమావేశమయ్యారు. ఆర్ఆర్ఆర్ ప్రతిపాదనలు, మార్గం గురించి సమగ్ర వివరాలను సేకరించి, రైల్వే లైన్ ఏర్పాటుకు ఎంత భూసేకరణ అవసరం, సాంకేతిక సమస్యలు వంటి అంశాలపై చర్చించారు. ఆర్ఆర్ఆర్ వెంట రైల్వే లైన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ప్రస్తుతం అధ్యయనం జరుగుతోంది. రైల్వే లైన్, రైల్వే స్టేషన్లు, లైన్ల అనుసంధానం, జంక్షన్లు వంటి విషయాలను సమగ్రంగా పరిశీలిస్తున్నారు. వచ్చే వారం మరోసారి రైల్వే, రాష్ట్ర రవాణా, ఆర్అండ్‌బీ శాఖల ఉన్నతాధికారులు సమావేశం కానున్నారు. ఈ చర్చల అనంతరం భూసేకరణ, ఇతర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం కోసం 100 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించగా, దక్షిణ భాగంలో కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. రింగ్ రైలు కోసం కనీసం 50 మీటర్ల వెడల్పుతో ఉత్తర, దక్షిణ భాగాల్లో భూసేకరణ అవసరమవుతుందని అంచనా వేస్తున్నారు. రైల్వే స్టేషన్లు, జంక్షన్ల వద్ద అదనపు భూమి అవసరం ఉంటుంది. రోడ్డుకు ఎత్తు ఎక్కువ అవసరం కాగా, రైల్వే లైన్‌కు అలా అవసరం లేదు. ఇలా రెండింటినీ పక్కపక్కనే ఏర్పాటు చేయడం ద్వారా ఉత్పన్నమయ్యే సాంకేతిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై రైల్వే శాఖ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. రైల్వే లైన్ ఏర్పాటు దాదాపు ఖరారైనట్లు అధికారులు చెబుతున్నారు. రీజినల్ రింగు రైల్ నిర్మాణం పూర్తయితే, ఆ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెంది, ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఈ లైన్ వెళ్లే జిల్లాలు, మండలాలు, గ్రామాల రూపురేఖలు రాబోయే రోజుల్లో పూర్తిగా మారి, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు గణనీయంగా వృద్ధి చెందుతాయని విశ్లేషిస్తున్నారు.

# రెండు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

బాక్సులు అవసరమైతే వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించాలని పంచాయతీరాజ్ శాఖ పేర్కొంది. అలాగే, పోలింగ్ కేంద్రాల ఎంపిక, కేటాయింపులు, దశలవారీగా ఎన్నికల సిబ్బందికి విధులు తదితర ఏర్పాట్ల ప్రణాళికను రూపొందించాలని సూచించింది.(స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతుండటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్ల ప్రక్రియను వేగవంతం చేసింది. ఎన్నికలకు అత్యంత ముఖ్యమైన ఓటర్ల తుది జాబితా తయారీపై దృష్టి సారించింది. పంచాయతీరాజ్ శాఖ నిర్ణయం ప్రకారం, పంచాయతీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తిరిగి తయారు చేస్తున్నారు.ఇప్పటికే రెండుసార్లు పంచాయతీ ఎన్నికల కోసం జాబితాను రూపొందించి ఎంపీడీవోల లాగిన్ ద్వారా టీపోల్ పోర్టల్‌లో నమోదు చేశారు. అయితే, పంచాయతీలు, వార్డుల సంఖ్య పెరగడం లేదా తగ్గడం నేపథ్యంలో మళ్లీ ఒకసారి జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. కొత్తగా ఓటర్ల జాబితాను రూపొందించడంతో కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. పాత జాబితా రూపొందించి ఆరు నెలలు పూర్తయినందున, ఈ మధ్యకాలంలో మృతిచెందిన వారి పేర్లు తొలగిస్తారు.అలాగే, ఈ ఆరు నెలల కాలంలో కొత్తగా ఓటు నమోదు చేసుకున్నవారిని వారి కుటుంబ సభ్యుల పోలింగ్ బూత్ పరిధిలో నమోదు చేస్తారు. దీంతో గతంలో కేటాయించిన జాబితా సీరియల్ నంబర్లు మారనున్నాయి. పంచాయతీ కార్యదర్శులు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని వార్డుల వారీగా మళ్లీ జాబితా రూపొందిస్తున్నారు. మార్చి 2025లో విడుదలైన సాధారణ జాబితా తర్వాత నాలుగు నెలల కాలంలో కొత్తగా ఓటు నమోదు చేసుకున్నవారికి కూడా పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాల్సి ఉంది. దీంతో ఎన్నికల సంఘం మళ్లీ తుది జాబితా రూపకల్పనకు ప్రాధాన్యమిచ్చింది. ఫలితంగా ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# బీసీ వాదం ముసుగులో ప్రయాణిస్తున్న నాయకులు కండ్లు తెరవాలి

## - బీసీలందరూ ఐక్యతతో ఉంటే మదపుటేనుగునైనా బంధించవచ్చు - సామాజిక స్పృహతో కదలి మీ హక్కులను సాధించుకోండి

**మంథని ప్రతినిధి( ప్రశ్న న్యూస్)** భారతదేశంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం ఉన్న ప్రపంచ చరిత్రలోనే దాగి ఉన్న సత్యాన్ని మరిచి వ్యవహరించవద్దు. భారతదేశం ఫెడరల్ వ్యవస్థను కలిగి ఉన్నది. ఈ దేశం కేంద్రంతో సంయుక్త రాష్ట్రాలుగా మిళితమై ఉంది. భవిష్యత్తు భావితరాలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ, రాష్ట్ర పరిపాలన సౌలభ్యం కోసం రాజ్యాంగంలో కేంద్ర , ఉమ్మడి రాష్ట్ర మూడు జాబితాలను రాజ్యాంగంలో పొందపరిచారు. అందుకే రాష్ట్రాలలో నివసించే ప్రజల హక్కుల అభ్యున్నతికి సమైక్యంగా ఉండాలని కేంద్రాన్నికి సూచించడం జరిగింది. ఎస్సీ వర్గీకరణ సామాజిక సమస్య అయినప్పటికీ దానిని నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టుకు వెళ్లి ఏడుగురు న్యాయమూర్తుల తీర్పుతో రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చు అనే వేషాలు బాటుతో, అట్టడుగు వర్గాల వారికి అన్యాయం జరుగుతే మళ్లీ సుప్రీంకోర్టుకు రావచ్చని తీర్పునిస్తే దానిని అత్యుత్సాహంతో బిల్లును ప్రవేశపెట్టి ఎస్సీ జనాభా పెరిగిన దానికి అనుగుణంగా పెంచకుండా ఉన్నదానిని వర్గీకరించి ఎస్సీ కులాల మధ్య కొట్లాట పెట్టిన ఘనత రేవంత్ సర్కారీ కే దక్కుతుంది. అదేవిధంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో రిజర్వేషన్ల వర్గీకరణ ఏ కులానికైనా, ఏ వర్గానికైనా అన్యాయం జరుగుతే మళ్లీ సుప్రీం కోర్టుకు వచ్చి కేసు వేసుకోవచ్చని వెసులుబాటును కల్పించారు. ఇట్టి విషయాన్ని రాష్ట్రంలో ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా ఉండకుండా 42% తోటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు భాగంగా మమని రాష్ట్ర చట్టసభలలో చర్చించి, ఆమోదించి తీర్మానం చేసి కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వానికి బిల్లును పంపితే రాష్ట్రానికే సీలింగు విధిస్తూ తెరస్కరించి రిజర్వేషన్ పెంపుదలను వెనుకకు పంపించి తస్కారం చేస్తున్నా విషయాన్ని తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజలు గమనిస్తున్నారు. ఎన్నికల సమయంలో బిజెపి పార్టీ బిసి ముఖ్యమంత్రిని చేస్తానని మాయ మాటలు చెప్పి రాష్ట్ర ప్రజల ఓట్లను దండుకొని ఎనిమిది మంది శాసనసభ్యులను, లోకసభ సభ్యులకు ఇక్కడి బీసీ ప్రజలు పట్టం కడితే రాష్ట్రంలో ఉన్న బిజెపి ఎమ్మెల్యేలు ఎంపీలు 42% రిజర్వేషన్ల పెంపుదలకు పోరాడకుండా అధ్యక్షుడైన రామచంద్రారావు అసాధ్యం అని



ప్రజలను ఇంకా నమ్మిస్తున్నాడు. వందేవాడు మనవాడైతే ఎక్కడున్నా భుజించొచ్చు అనే సామెతను విస్మరించి బీజేపీ నాయకుల ప్రవర్తన సరళి ప్రజలు అర్థం చేసుకొని మసులుకోవలసిన సమయము ఆసన్నమైంది. దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం అంబేద్కర్ చిన్న రాష్ట్రాల వలననే అభివృద్ధి సాధ్యమవుతుంది అనే ఆర్టికల్ ద్వారా పొందుపరిస్తే ఇప్పటి బిజెపి అధికార పార్టీ రాష్ట్రాల హక్కులను హరిస్తుంది. ఓ బీసీ మేధావులారా, రాజకీయ నాయకులారా, విజ్ఞానవంతులారా ప్రజలారా ఐక్యంగా పోరాడి సాధించుకోండి అడుక్క తింటే రాదు తన్ని గుంజుకుంటే అధికారం వస్తుందన్నా నానుడిని మర్చిపోవద్దు. బీసీ రిజర్వేషన్ల పెరుగుదల బిల్లును ఆర్డినెన్స్ రూపంలో గవర్నర్ గారికి పంపితే సాంకేతిక న్యాయ సలహాలను తీసుకొని బిల్లు పైన సంతకం చేయకుండా ఎందుకు ఆలస్యం అవుతున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ వాకాబ్ ఎందుకు చేస్తలేదు బీసీలు అందరూ ఆలోచించాలి. ఇకనుండి అయినా రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేసి బిల్లును పాస్ చేసుకొని బీసీలు ఏకమై మీ అస్తిత్వాన్ని రుజువు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. 60 శాతం బీసీ జనాభా ఉన్నదని ప్రగల్భాలు పలికి వేదికలెక్కి వాదం చేస్తున్న నాయకులందరూ ఎక్కడ కూర్చుండి ఉన్నారో బీసీ మేధావులారా, రాజకీయ నాయకులారా, ప్రజలారా మునుముందుకు కదిలి మీ రిజర్వేషన్ల పెంపుదలకు అన్ని పార్టీల సహాయ సహకారాలతో మును ముందుకు కదిలి ముమ్మరంగ సాగండి.

తమిళనాడు రాష్ట్రంలో దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల పై ఉన్న సీలింగు గుర్తు చేయకుండా మన. తెలంగాణ రాష్ట్రం వరకు వస్తే మరొక న్యాయం. దేశ జనాభాలో 60 శాతం ఉన్న బిసి వాదులు రాజ్యాధికారం కోసం మన హక్కులను మనం సాధించే వరకు మన అభివృద్ధి నాంది పలికి. ఇకనుండి అయినా రాష్ట్రంలో ఉన్న దేశంలో ఉన్న బీసీ వాదులు ఐక్యమై రిజర్వేషన్ల పెంపుదలకై ఉద్యమించండి మీ ఐక్యతను కాపాడుకోవాలి.

# గోవా నుంచి అక్రమంగా మద్యం..
# టోల్ ప్లాజా వద్ద గంజాయి సీజ్

మునిపల్లి : గోవా నుంచి హైదరాబాద్ తరలిస్తున్న 6.5 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వినారెడ్డి తెలిపారు. ఆదివారం మునిపల్లి మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులో గల ముంబై జాతీయ రహదారిపై ఉన్న డెక్కన్ టోల్ ప్లాజా వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల సంబంధిత ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వినారెడ్డి మాట్లాడుతూ.. గోవా నుంచి హైదరాబాద్ వస్తున్న ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేయగా.. ఓ ట్రావెల్స్ బస్సులో అక్రమ మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. 6.5 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేపట్టి వాహనాలు తనిఖీ చేసే క్రమంలో జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న బైకుపై ఇద్దరు వ్యక్తులు 1250 గ్రాముల ఎండు గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. గంజాయితోపాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి తరలిస్తున్న శ్రీధర్, జెహోర అనే ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్ పట్టణంలోని మూసాపేట్ ప్రాంతానికి చెందిన వారిగా ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ అలీమ్, కానిస్టేబుల్స్ యాదయ్య, మల్కయ్య, కరీం, ప్రహ్లాద రెడ్డి, ఉమాలు ఉన్నారు.

# వన దుర్గ భవాని సన్నిధిలో..
# ఏడుపాయలలో భక్తుల సందడి

పాపన్నపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వన దుర్గ భవాని దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, బోనాలు సమర్పించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల రాక పెరిగే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం తగిన బందోబస్తు చర్యలు చేపట్టింది.

# గుజరాత్‌లో భారీ వర్షాలు.. ఇళ్లలోకి వరదనీరు

బంగాళాఖాతం లో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్ లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. అహ్మదాబాద్ , పటాన్‌లోని సిధ్‌పూర్ పట్టణాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరదలు పోటెత్తాయి. వరద చేరడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరోవైపు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదలు, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు, టెలీకమ్యూనికేషన్‌కు అంతరాయం ఏర్పడింది.

# ఈ అలవాట్లు మీకు ఉన్నాయా..?
# అయితే మీ లివర్ ప్రమాదంలో పడుతుంది జాగ్రత్త..!

మన శరీరంలో అంతర్గతంగా ఉన్న అతి పెద్ద అవయవాల్లో లివర్ ఒకటి. ఇది సుమారుగా 500 కు పైగా జీవక్రియలను నిర్వర్తిస్తుంది. రక్తంలో ఉన్న మలినాలు, టాక్సిన్లను బయటకు పంపించడం, మనం తీసుకునే ఔషధాలను, ఆహారంలో ఉండే పోషకాలను శరీరానికి అందేలా చూడడం, మనం తిన్న ఆహారం జీర్ణం అయ్యేందుకు అవసరం అయిన పైత్య రసాన్ని ఉత్పత్తి చేయడం వంటి అనేక పనులు చేస్తుంది. అయితే మనం పాటించే అలవాట్లు, తినే ఆహారం కారణంగా తరచూ లివర్‌పై భారం పడుతుంది. దీంతో దీర్ఘకాలంలో అది లివర్ డ్యామేజ్ అయ్యేందుకు దారి తీస్తుంది. లివర్ డ్యామేజ్ అయ్యేందుకు దారి తీసే కారణాల్లో మద్యం సేవించడం కూడా ఒకటి. ప్రస్తుతం చాలా మంది అధికంగా మద్యాన్ని సేవిస్తున్నారు. ఆల్కహాల్ అనేది లివర్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. మద్యం సేవించిన తరువాత దాన్ని శరీరం నుంచి బయటకు పంపించేందుకు లివర్ తీవ్రంగా శ్రమిస్తుంది.తరచూ మద్యం సేవిస్తే ఒకానొక దశలో లివర్ పనితీరు మందగిస్తుంది. దీంతో శరీరంలో టాక్సిన్లు పేరుకుపోతాయి. ఫలితంగా లివర్ డ్యామేజ్ అవుతుంది. మద్యం అధికంగా సేవించేవారికి ఫ్యాటీ లివర్ అనే సమస్య వస్తుంది. మద్యం సేవించడం కారణంగా శరీరంలో అధికంగా ఉండే కొవ్వును లివర్ కరిగించలేదు. దీంతో ఆ కొవ్వు లివర్‌లో పేరుకుపోతుంది. దీర్ఘకాలంలో ఇది ఫ్యాటీ లివర్‌కు దారి తీస్తుంది. కనుక మద్యం అతిగా సేవించకూడదు. కొందరు మద్యం ప్రియులకు లివర్ సిర్రోసిస్ అనే జబ్బు కూడా వస్తుంది. ఇది మరీ మద్యం శృతి మించి తాగితే వస్తుంది. చాలా ప్రమాదకరమైంది. కనుక మద్యం అధికంగా సేవిస్తున్న వారు జాగ్రత్తగా ఉండాలి. దాన్ని మానే ప్రయత్నం చేయాలి. లేదంటే లివర్ డ్యామేజ్ అవుతుంది.కొందరు మద్యం సేవించకపోయినా, నాన్ వెజ్ వంటి ఆహారాలను అధికంగా తినకపోయినా వారి లివర్ డ్యామేజ్ అవుతుంది. అందుకు కారణం అలాంటి వారు చిరు తిళ్లను అధికంగా తినడమే. చిరు తిళ్లను, స్వీట్లను అధికంగా తిన్నా కూడా లివర్‌లో కొవ్వు పేరుకుపోతుంది. ఇది నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యకు కారణం అవుతుంది. నాన్ వెజ్‌ను అధికంగా తిన్నా కూడా ఈ సమస్య వస్తుంది. కనుక ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రాసెస్ చేయబడిన ఆహారాలు, వేపుళ్లు, ఇతర జంక్ ఫుడ్‌లో ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. ఇవి అనారోగ్యకరమైన కొవ్వులు. శరీరంలో ఇవి అధికంగా చేరితే కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి లివర్‌లో సైతం కొవ్వు చేరుతుంది. ఇది ఫ్యాటీ లివర్‌కు కారణం అవుతుంది. కనుక ఆరోగ్యకరమైన ఆహారాలను తినాలి. పండ్లు, కూరగాయలను తింటుంటే మేలు జరుగుతుంది.

కొన్ని రకాల మందులను దీర్ఘకాలంగా వాడడం వల్ల కూడా లివర్ డ్యామేజ్ అవుతుంది. జ్వరం తగ్గేందుకు కారణం అయ్యే పారాసిటమాల్ (డోలో) వంటి మందులు, పెయిన్ కిల్లర్ ఔషధాలు వంటి వాటిని దీర్ఘకాలంగా ఉపయోగిస్తే వాటి ప్రభావం లివర్‌పై పడి లివర్ డ్యామేజ్ అయ్యేందుకు కారణం అవుతాయి. అలాగే నిత్యం గంటల తరబడి కూర్చుని పనిచేసే వారి లివర్ డ్యామేజ్ అయ్యేందుకు కూడా అవకాశాలు అధికంగా ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు.


# ఆలయంలో పాము కలకలం..
# భయంతో హడలిపోయిన భక్తులు..

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి లోని రాహుకేతు ఆలయం లో పాము కలకలం రేగింది. ఆలయ ప్రాంగణంలోకి 7 అడుగుల పొడవున్న పాము ప్రవేశించడంతో భక్తులు హడలిపోయారు.



రాహుకేతు పూజలు జరిగే మండపం మెట్ల వద్ద పామును చూసిన భక్తులు భయంతో పరుగులు తీశారు. దాంతో ఆలయ అధికారులు అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీ సిబ్బంది ఆ పామును చాకచక్యంగా పట్టుకుని సంచిలో బంధించారు. దాన్ని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

## మేడ్చల్ జిల్లాలో దారుణం..
## భర్త హత్యకు భార్య కుట్ర




దుండిగల్ : ఇటీవల కాలంలో కట్టుకున్న భర్తలను హత్య చేయించడం ట్రెండింగ్‌గా మారిందనకుందో ఏమో.. ఓ మహిళ. తాను కూడ అదే జాబితాలో చేరిపోవాలనుకుందో తెలీయదు కాని, తాను సైతం కిరాయి మనుషులతో భర్తను చంపించాలనుకుంది. అయితే నూకలు గట్టిగా ఉండటంతో బాధిత భర్త బతికి బయటపడటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

## శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో..
## ఒక గేటు ఎత్తివేత



శ్రీశైలం: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఆదివారం జూరాల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 34,088 క్యూసెక్కులు, క్రస్ట్ గేట్ల ద్వారా 31,504 క్యూసెక్కులు, సుంకేశుల నుండి 52,682 క్యూసెక్కుల నీరు విడుదలై సాయంత్రానికి 1,02,580 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరింది. ఒక్క గేటును 10 అడుగుల ఎత్తుతో తెరచి 26,698 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తుండగా కుడి, ఎడమ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 66,417 క్యూసెక్కుల నీరు సాగర్‌కు చేరుకుంటుంది. అదే విధంగా జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా ప్రస్తుతం 882 అడుగులు ఉండగా పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 198.81 టీఎంసీలు ఉన్నాయి.

## శ్రీశైలంలో ఆగస్టు నెలంతా స్పర్శదర్శనాలు



శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవులతోపాటు ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉండటంతో పర్యాటకుల తాకిడి పెరుగుతొంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులతో క్షేత్ర పురవీధులు కళకళలాడాయి. ఉభయ దేవాలయాలలో స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించడంతోపాటు ఆయా ఆర్జిత సేవలు యధాతథంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. శ్రావణ మాసంతోపాటు పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో వస్తుండటంతో అందరికీ స్పర్శదర్శనాలు కల్పించేలా అన్ని రోజులు స్పర్శదర్శనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. srisailadevasthanam.org ఆన్‌లైన్‌లో రోజుకు మూడు స్లాట్స్‌లలో ఉండే టిక్కెట్లను ముందస్తుగా నమోదు చేసుకుని తగిన రశీదులతోపాటు ఆధార్ తప్పనిసరిగా తీసుకుని దర్శనాలకు రావాలని అధికారులు పేర్కొన్నారు.

## సారూ మా రోడ్లు బాగు చేయరా..
## బురద రోడ్లపై వరినాట్లు వేసి నిరసన



మెదక్ రూరల్ : మెదక్ మండలంలోని హవేలీ ఘన్‌పూర్ , దూప్ సింగ్ తాండ, మల్కాపూర్‌లోని స్కూల్ తాండ, పలుగ్రామాల్లో ఉన్న అంతర్గత రహదారులు వర్షం కురిస్తే పూర్తిగా బురదమయం అవుతాయి. దీంతో కనీసం నడవడానికి కూడా వీలు కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లేందుకు అంతర్గత మట్టి రోడ్లు మాత్రమే దిక్కు. ఇవన్నీ వర్షాలు పడితే పూర్తిగా బురదగా మారుతాయి. నిత్యం ప్రజలు ఈ రోడ్ల గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు ఈ రోడ్ల గుండానే వెళ్తారు. ఈ రోడ్లను బాగుచేస్తే ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణం సులభతరంగా మారుతుంది. కానీ అధికారులు గానీ పాలకులు గానీ మా గోస పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్కూల్ తాండ వాసులు బురద రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. వర్షాకాలంలో మట్టిరోడ్లు అస్థవ్యస్తంగా తయారయ్యాయన్నారు స్కూల్ తాండ వాసులు. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్నాయని.. రోడ్లను బాగు చేయాలని

## ప్రాజెక్టులు, చెరువుల దగ్గరికి ఎవరూ వెళ్లొద్దు

**- అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ రూరల్ :** భారీ వర్షాల వలన ప్రజలు ఎవ్వరూ కూడా ప్రాజెక్టులు, చెరువుల దగ్గరకు వెళ్లరాదని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. ఆదివారం భారీ నీటి ప్రవాహం కారణంగా హవేలీ ఘన్ పూర్ మండలం దూప్ సింగ్ తండా వాగు పొంగి పొర్లుతుంది. ఈ విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ నగేష్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వరద ఉధృతి ఉన్న దగ్గర హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, భారీ వర్షాలు వరదల వలన ప్రజలు చెరువులు దగ్గరకు వెళ్ళరాదని హెచ్చరించారు. వరద పరిస్థితిని నిశితంగా పరిశీలించాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే తమకు నివేదించాలని.. ప్రజలను ఎవరు కూడా అటువైపు వెళ్లకుండా చూడాలని అధికారులతో అన్నారు. ప్రస్తుతం దూప్ సింగ్ తండాకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ నగేష్ వెంట ఎమ్మార్వో, సిబ్బంది ఉన్నారు.

## జూ సూపర్‌వైజర్‌పై ఆడ పులి దాడి..



తిరువనంతపురం : కేరళ రాజధాని తిరువనంతపురంలోని జూపార్కులో దారుణం జరిగింది. ఓ ఆడ పులి జూపార్కు సూపర్‌వైజర్‌పై ఆదివారం దాడి చేసి గాయపరిచింది. వివరాల్లోకి వెళ్తే.. జూపార్కు సూపర్‌వైజర్ రామచంద్రన్ నాయర్ విధుల్లో భాగంగా.. పులి ఎన్‌క్లోజర్‌కు సమీపంలో ఉండి క్లీనింగ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. అంతలోనే ఆడపులి బబిత తన ఎన్‌క్లోజర్ నుంచి తప్పించుకుని బయటకు వచ్చి సూపర్‌వైజర్‌పై దాడి చేసింది. ఈ దాడిలో ఆయన తలకు తీవ్రమైంది. అప్రమత్తమైన సిబ్బంది.. పులిని మళ్లీ ఎన్‌క్లోజర్‌లో బంధించారు. గాయపడిన రామచంద్రన్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆయనను తిరువనంతపురం మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. సూపర్‌వైజర్ తలకు నాలుగు కుట్లు పడ్డాయని, ఆయనకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఈ ఆడపులిని 2024 ఏప్రిల్‌లో వయనాడ్ నుంచి తిరువనంతపురానికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

## శ్మశానవాటిక లేక ఇబ్బందులు..
## లింగాయత్‌లు ఏం చేశారంటే?



ముంబై: శ్మశానవాటిక లేకపోవడంతో లింగాయత్‌లు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వినూత్నంగా నిరసన తెలిపారు. ఒక మృతదేహంతో మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ బైఠాయించారు. (Lingayats Of A Maharashtra) మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అంబజోగై నగరానికి చెందిన లింగాయత్ కమ్యూనిటీ సభ్యులు చాలా కాలంగా బారాఖంబి ప్రాంతంలోని శ్మశానవాటికపై ఆధారపడ్డారు. అయితే ఆ పవిత్ర స్థలాన్ని పురావస్తు శాఖ ఆక్రమించిందని వారు ఆరోపించారు. దీంతో తమ వర్గంలో మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించడానికి తగిన స్థలం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లింగాయత్‌ల కోసం శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. కాగా, బీజేపీ ఎమ్మెల్యే నమిత ముందాడ ప్రాతినిధ్యం వహిస్తున్న అంబజోగైకు చెందిన లింగాయత్‌లు ఆదివారం తమ అసంతృప్తిని తీవ్రం చేశారు. ఒక మృతదేహంతో స్థానిక మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వందలాది లింగాయత్ కమ్యూనిటీ సభ్యులు అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. తమ వర్గం కోసం తక్షణం శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని

## సైబరాబాద్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు..
## 1318 మంది అరెస్ట్



హైదరాబాద్ : సైబరాబాద్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టుల సందర్భంగా ఒక్క జులై నెలలోనే 1318 మంది పట్టుబడినట్లు సైబరాబాద్ పోలీసులు తెలిపారు. ఇందులో 38 మందికి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. మరో 31 మందికి జరిమానా విధించారు. ఇక శనివారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టుల్లో 120 మంది పట్టుబడినట్లు తెలిపారు. 71 మంది బైకర్లు, నలుగురు ఆటో డ్రైవర్లు, 43 మంది ఫోర్ వీలర్ డ్రైవర్లు, ఇద్దరు హెవీ వెహికల్ డ్రైవర్లు ఉన్నారు. 106 మంది నిందితుల రక్తంలో ఆల్కహాల్ సాంద్రత 35 mg/100 ml నుండి 200 mg/100 ml వరకు ఉంది. మరో ఎనిమిది మందికి 201 mg/100 ml నుండి 300 mg/100 ml వరకు ఉంది. ఇంకో ఆరుగురిలో 301 mg/100 ml నుండి 500 mg/100 ml వరకు ఉన్నాయి. వీరందరిని కోర్టు ముందు హాజరు పరిచి శిక్ష విధిస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఎవరైనా మద్యం మత్తులో వాహనం నడుపుతూ ప్రాణాంతక ప్రమాదానికి కారణమైతే, వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేయబడుతుంది. ఈ సెక్షన్ కింద గరిష్టంగా 10 ఏండ్ల జైలు శిక్ష, జరిమానా విధించబడును.

## వారంతా మళ్లీ కలిశారు..
## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పాపన్నపేట : వారంతా ఒక్కచోట కలిసి చదువుకున్నారు. ఇప్పుడు వారంతా వివిధ వృత్తులు, ఉద్యోగాలు, పనులతో బిజీగా మారిపోయారు. చాలా కాలం తర్వాత ఆ పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి మంజీరా గార్డెన్ వేదికైంది. ఆదివారం పాపన్నపేటలోని మంజీరా గార్డెన్‌లో 2009-10 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2009-10 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు 15 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంతో మళ్లీ కలుసుకున్నారు. వారంతా పాఠశాల జీవితంలో జరిగిన తమ అనుభవాలు, అనుభూతులను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, మోహన్ రాజ్, అంజాగౌడ్, శ్రీధర్ రెడ్డి, పోచయ్య, ఆసిఫ్, మల్లేశం, జ్ఞానబ్, శ్రీనివాస్, సూర్యకళ తదితరులను ఘనంగా సన్మానించి.. వారికి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

## ట్రిపుల్ మర్డర్ షాక్.. తల్లిదండ్రులు,
## సోదరిని గొడ్డలితో నరికి చంపిన వ్యక్తి



లక్నో: ఒక వ్యక్తి తన తల్లిదండ్రులు, సోదరిని గొడ్డలితో నరికి చంపాడు. భూ వివాదం కారణంగా ఈ హత్యలకు పాల్పడ్డాడు. (Man Hacks Parents, Sister) ట్రిపుల్ మర్డర్ విషయం తెలుసుకుని స్థానికులు షాక్ అయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం దిలియా గ్రామంలో దారుణ హత్యలు జరిగాయి. భూ వివాదం కారణంగా ఒక వ్యక్తి తన తల్లిదండ్రులు, సోదరిని గొడ్డలితో నరికి చంపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రిపుల్ మర్డర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడ్ని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. మరోవైపు ట్రిపుల్ మర్డర్ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

## ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి కోసం..
## కన్న బిడ్డను బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిన తల్లి



ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి మోజులో పడిన ఓ మహిళ కన్న కొడుకునే కాదనుకుంది. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన మహిళ.. ఐదేళ్ల కుమారుడిని అనాథగా బస్టాండ్‌లో వదిలేసి ప్రియుడితో వెళ్లిపోయింది. బిక్కుబిక్కుమంటూ బస్టాండ్‌లో ఏడుస్తూ కూర్చున్న చిన్నారిని స్థానికులు గమనించి ఆరా తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నల్గొండ బస్టాండ్‌లో ఈ దారుణం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన పాతికేళ్ల మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో నల్గొండకు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇన్‌స్టాగ్రామ్‌లో తరచూ చాటింగ్ చేసుకోవడం ద్వారా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్త ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇద్దరూ కలుసుకోవాలని అనుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఆ యువకుడిని కలవాలనే ఆశతో తన ఐదేళ్ల కొడుకును వెంటబెట్టుకుని నల్గొండకు వచ్చింది. బస్టాండ్‌లో దిగిన వెంటనే సదరు యువకుడికి ఫోన్ చేయడంతో బైక్‌పై వచ్చాడు. అక్కడకు వచ్చిన తర్వాత యువకుడు తన వెంటన రమ్మని బలవంతం చేశాడు. దీంతో అతనితోనే వెళ్లిపోవాలని సదరు మహిళ కూడా భావించింది. అయితే ఆమెకు కన్న బిడ్డనే అడ్డంకిగా కనిపించాడు. ప్రియుడి మోజులో పడిన ఆ మహిళ.. కన్నబిడ్డును దిక్కు లేని అనాథగా బస్టాండ్‌లో వదిలేసింది. బస్టాండ్‌లోని ఒక బెంచి మీద కూర్చోబెట్టి.. యువకుడి బైక్‌పై వెళ్లిపోయింది.

## మీది ప్రజా ప్రభుత్వం కాదు..
## ముమ్మాటికీ ప్రతీకార ప్రభుత్వం

**- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. మీది ప్రజా ప్రభుత్వం కాదు.. ముమ్మాటికీ ప్రతీకార ప్రభుత్వం అని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ అంటే ఇంత భయమైనప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకొని పాలన చేయవచ్చు కదా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. మీది ప్రజా ప్రభుత్వం కాదు ముమ్మాటికీ ప్రతీకార ప్రభుత్వం. మీ కాంగ్రెస్ పాలన చూసి తెలంగాణలో పెళ్లయిన జంటలు పిల్లలను కనడానికి కూడా జంకుతున్నరు. ఇప్పటికే కన్న బిడ్డలను మీ బడులకు పంపడానికి భయపడుతున్నరు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. మీరు మాత్రం ఇవేమీ పట్టనట్టుగా మా భావితరాల భవిష్యత్తును బొంద పెట్టి 'ఆంధ్ర' బీజేపీ కాంట్రాక్టర్ సీయం రమేష్ తో కలసి భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తమంటున్నరు! కేవలం మీ నలుగురు అన్నదమ్ముల భవిష్యత్ బాగుంటే చాలా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

## సేవా తపస్వీ ముదుగంటి సురేందర్ రెడ్డికి

# జన్మదిన వేడుకలు

### - బోయినిపల్లి సెస్ డైరెక్టర్ : కొట్టెపల్లి సుధాకర్



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్,నర్సింగపూర్ సొసైటీ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని వారి నివాసానికి బోయినిపల్లి సెస్ డైరెక్టర్,ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ వెళ్లి, సురేందర్ రెడ్డితో కేక్ కట్ చేయించి ,మిఠాయిలు తినిపించి, పట్టుశాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, ప్రజా సేవలో నిత్యం నిమగ్నమై జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న సురేందర్ రెడ్డికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమ్మ పేరున అన్నదానం అభినందనీయం

**తల్లికి నివాళిగా నిరుపేదలకు అన్నదానం**

**నీలమ్మ 9వ వర్ధంతి సందర్భంగా 2,000 మందికి భోజనం**

**అన్నెపు ప్రభు సేవలను పొగిడిన సీపీఐ నేత పర్వతాలు**



రాజేంద్రనగర్( ప్రశ్న న్యూస్) తన తల్లి నీలమ్మ పేరున 9వ వర్ధంతి సందర్భంగా కుమారుడు అన్నెపు ప్రభు సోమవారం రోజు 2,000 మంది పేదలకు అన్నదానాన్ని నిర్వహించి మాతృ ప్రేమకు ఉదాహరణగా నిలిచారు. శంషాబాద్ జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వతాలు ముఖ్య అతిథిగా పాల్గొని, అన్నదానానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ ు కోడలు కొడుకులు సరిగా చూసుకోక వదిలేస్తే వృద్ధాశ్రమాలు నిండిపోతున్న ఈ కాలంలో, తల్లిని జ్ఞాపకం చేసుకుంటూ సేవచేసే కొడుకులు అరుదు. కానీ తన అమ్మ పేరున ప్రతి యేటా అన్యపు ప్రభు ప్రతి సంవత్సరం అన్నదానం చేస్తుండటం ప్రశంసనీయం" అని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న అన్నెపు ప్రభు, కార్మికుల సంక్షేమంతో పాటు సామాజిక సేవలోనూ అంకితభావం కనబరుస్తున్నారని కొనియాడారు. ఇలాంటి ఒక మంచి ఆలోచన రావడం ఎంతోమంది పేదలకు ప్రతీ యేటా ఎంతో మందికి అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం చాలా గొప్ప విషయం అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. యాదగిరి, మండల కార్యదర్శులు నర్రగిరి నందిగామ, గడ్డం జంగయ్య, ఎస్. మల్లేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, ఇతర పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కార్మికులు పాల్గొన్నారు.
సేవకార్యకర్తలుగా పాల్గొన్న వారు: ఎల్. అరుణ్, శ్రీనివాస్ చారి, నీరటి శ్రీనివాస్ ముదిరాజ్, దేవులపల్లి ఉదయ్ రాజ్, కావాలి

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నార్థులకు అన్నదాన సేవలు

**- రాజన్న ఆలయం వద్ద 150 మందికి అన్నదానం**

**- గత 1556 రోజులుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న అన్నదాన సేవలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఆదివారం "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో యాచకులకు,భక్తులకు,అన్నార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 1556 రోజులుగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం 150 మందికి భోజనం వడ్డించారు.

- **ఎఆదివారం అన్నదాతలుగాలి**
- **హైదరాబాద్ అసిఫ్ నగర్‌కు చెందిన కీ.శే. మాజీ ఎమ్మెల్యే బట్కేరి కృష్ణ ఐదవ వర్ధంతి సందర్భంగా**
- **మేకల పరశురాం కుమార్తె పుట్టినరోజు సందర్భంగా**
- **నాగుల రాజేశ్వర్ గౌడ్-తేజస్విని దంపతుల కుమారుడు పుట్టినరోజు సందర్భంగా**
- **లక్కాకుల రవికుమార్-నాగశిరీష దంపతుల కుమారుడు పుట్టినరోజు సందర్భంగా**

అలాగే శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత, ప్రతాప్-స్వప్న సంపత్, నగుబోతు రవీందర్-జ్యోతి, గణాచారి మఠం శైలజ-సాంబశివు, దేవరాజు ఉమ-బాలచందర్ రాజు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు తోడ్పాటును అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ మాట్లాడుతూ, "పేదలకు ఒక్క పూట అయినా భోజనం అందించాలనుకునే దాతలు ట్రస్ట్ సభ్యులను లేదా 92469 39388 నంబరును సంప్రదించాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, డాక్టర్ బెజ్జంకి రవీందర్, వొద్యాల వేణు,మహమ్మద్ అబ్దుల్ రఫీక్,ప్రతాప్ నటరాజు,పాత సంతోష్, పసుల శ్రీనివాస్,సగ్గు రాహుల్, మ్యాకల పరశురాం,గుంటి కనకయ్య,ఏనుగుల కృష్ణ, గాజర్ల దేవరాజు,నాగారం కొమరవ్వ,బాధ పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

## వరి నాట్లు వేసే కూలీలను ఆప్యాయంగా పలుకరించిన మంత్రి సీతక్క



ములుగు (ప్రశ్న న్యూస్) ములుగు లీల గార్డెన్ ఎదుట వరి నాట్లు వేస్తున్న మహిళలను అపాయంగా పలకరించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క బురద పొలంలోకి దిగి కూలీల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్న సీతక్క వర్షం నుంచి రక్షణకై ప్రత్యేకంగా తయారు చేసిన కవర్లను కూలీలకు పంపిణీ చేసిన మంత్రి సీతక్క స్వయంగా కవర్లను కూలీలకు తొడిగి, వారి సంక్షేమం, ఆరోగ్యం పట్ల తన నిబద్ధతను చాటుకున్న మంత్రి సీతక్క రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్న మంత్రి రెండు మూడు రోజుల్లో అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చిన మంత్రి స్వయంగా మంత్రి తమ వద్దకు వచ్చి పలకరించడంతో కూలీల నోముల్లో దరహాసం ఈ కార్యక్రమలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## బాబుల్ రెడ్డి నగర్ లో యూటర్న్ ఏర్పాటు చేయండి

**రైల్వే స్టేషన్ వైపు వెళ్లకుండా అక్కడ గోడ ఏర్పాటు చేశారు**

**ఆరంగర్ వైపు వెళ్లేందుకు చాలా దూరం తిరగాల్సి వస్తుంది**

**ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు**

రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) బాబుల్ రెడ్డి నగర్ ప్రాంతంలో కొత్త యూటర్న్ ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రెడ్డి నగర్ వాసులు వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ నియోజక వర్గం బాబుల్ రెడ్డి నగర్ కాలనీ వాసులు ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గతంలో పాలేడియం ఫంక్షన్ హాల్ నుండి ఒకటి తొలి సోలిసిటీ స్కూల్ దగ్గర యూటర్న్లు ఉండేవి అవి ఇటీవల మూసి వేయడం జరిగింది. అయితే ఇప్పుడు ప్రజలకు ఆరంగర్ వైపు వెళ్లేందుకు చాలా దూరం తిరిగే పరిస్థితి వచ్చింది దీనివల్ల సమయం, ఇందనం, భద్రత వంటి విషయాలపై కాలనీ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్ వైపు వెళ్లకుండా అక్కడ గోడ ఏర్పాటు చేశారు. కాబట్టి మా సౌలభ్యం కోసం మూసివేసిన యూటర్న్ మరల తెరవాలని, అదేవిధంగా సోనీ టెరి స్కూల్ పాయింట్ను కొద్దిగా ముద్దుగా కొత్తగా ఒక సురక్షితమైన యూటర్న్ ఏర్పాటు అని కంప్లైంట్ చేసినారు. మొన్నటి నుండి దానిని మూసివేశారు. అధికారులు డివైడర్ గోడకు స్టీల్ అల్లించారు. దాని నిర్మాణం చేపట్టకుండా ప్రజల సౌకర్యం కోసం అందుబాటులోకి తేవాలని కోరుతున్నామని వారు అన్నారు. అలాగే మార్కండేయ నగర్, మైలార్ దేవులపల్లి పోలీస్ స్టేషన్ వద్ద, ఫోటోవర్ బ్రిడ్జి కార్మికులు స్కూల్ పిల్లలు కాలేజీ పిల్లల కోసం వదలాల్సిందిగా కోరుతున్నాము అని తెలిపారు. బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్, బృందావన్ కాలనీ, రామకృష్ణ హి ల్స్, టాటా నగర్, ప్రగతి కాలనీ, సౌకర్యం కోసం మధ్యలో సోలిటరీ స్కూలు దాటి కొద్దిగా ముందుకు ఒక కొత్త యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## రాచాల యుగంధర్ గౌడ్ కి గౌరవ డాక్టరేట్ ప్రధానం

**ప్రజా సమస్యలపై 15 ఏళ్లపాటు రాజీలేని పోరాటానికి గుర్తింపుగా గౌరవం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత పదిహేను ఏళ్లుగా ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడుతూ, సామాజిక సేవలో విశేషంగా పేరు తెచ్చుకున్న బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ కి గౌరవ డాక్టరేట్ లభించింది. శనివారం రాత్రి గోవా రాష్ట్రంలో రాయల్ సక్సెస్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఓ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో హెచ్ ఎస్ సి యూనివర్సిటీ ప్రతినిధులు ఈ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులకు ఈ గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేయగా, తెలంగాణ రాష్ట్రం నుంచి రాచాల యుగంధర్ గౌడ్ సామాజిక సేవ విభాగంలో ఎంపికయ్యారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా రాచాల మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నేను చేస్తున్న కార్యక్రమాలను గమనించి, నా సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ఇవ్వటం గర్వంగా ఉందని, ఇది నాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. నాకు లభించిన గౌరవానికి దోహదపడిన వనపర్తి జిల్లా ప్రజానీకానికి రాచాల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షోభంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్**




కాప్రా (ప్రశ్నన్యూస్) మతతత్వ రాజకీయాలకు కార్పొరేట్ శక్తులు మద్దతు ఇవ్వడం దేశానికి అత్యంత ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. ఆదివారం మేడ్చల్ జిల్లా సిపిఎం కార్యాలయం కమలానగర్‌లో జరిగిన సిపిఎం శాఖా కార్యదర్శుల విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జె.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ హాజరయ్యారు. ఈ సమావేశ ప్రారంభంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్‌కు నివాళి అర్పిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్థిక వ్యవస్థను ప్రస్తావిస్తూ పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నయా ఉదారవాద విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలంగా రూపొందిన ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణం. అమెరికాలో కోవిడ్ అనంతర కాలంలో పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. నిరుద్యోగం, వలసలు పెరిగాయి. తమ ప్రయోజనాల కోసం అమెరికా యుద్ధాలను ప్రోత్సహిస్తోంది. చైనాతో వాణిజ్య యుద్ధాలు కొనసాగిస్తున్నది. భారతదేశంలోని పరిస్థితులపై మాట్లాడుతూమోడీ ప్రభుత్వం నయావాద విధానాలను అమలు చేస్తూ, దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోంది,నిజ వేతనాలు తగ్గిపోతున్నాయి. సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. అమెరికాతో వ్యాపార ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం కలుగుతోంది. పాలు, సోయాబీన్ దిగుమతుల కారణంగా పంటలకు ధరలు పడిపోతున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల పరిస్థితులను ఉదాహరణగా చెబుతూ, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ఆదేశాలతో ఆ )దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. భారత్ కూడా అదే దిశగా వెళ్లే ప్రమాదం ఉంది. ప్రజలే దీనికి ప్రతిఘటించాలి అని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తుల కుట్రల్ని విశ్లేషిస్తూ పాల్గాం దాడి సందర్భంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మోడీ మౌనంగా ఉండడం అనుమానాస్పదం.

హిందుత్వాన్ని ముందుకు తేవాలనే కుతంత్రమే కనిపించింది అన్నారు. భారత్ నాలుగో ఆర్థిక శక్తిగా మారుతోంది అనే మోడీ మాటలు,కేవలం కార్పొరేట్‌లకు మద్దతుగా ఉన్నవే సామాజిక అసమానతలు పెరిగిపోతున్న దేశంలో ఇది అర్థవంతమైన వాదన కాదు.ప్రభుత్వ రంగాన్ని సర్వనాశనం చేసి, సహజ వనరులను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరుతో దాడులు చేయడం కుట్రే, అని పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఈ సంక్షోభ పరిస్థితుల నుంచి బయటపడాలంటే ప్రజా ఉద్యమాలు, సామూహిక పోరాటాలే మార్గమని స్పష్టం చేశారు. అన్ని రంగాలలో ప్రజలతో కలిసి ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం కొనసాగించాలి సమస్యలపై ప్రజా ఆందోళనలతో పాటు, పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలి అని అన్నారు.జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.రవి మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి పార్టీ కార్యకలాపాల్లో యువతను ఆకర్షించేందుకు మరింత ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐ.రాజశేఖర్, ఎ.అశోక్, ఎం.వినోద, కమిటి సభ్యులు, సీనియర్ నాయకులు, పూర్తి కాలం కార్యకర్తలు, శాఖా కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తిరునగరి తృష్ణ కు టాలెంట్ ఐకాన్ అవార్డు ప్రదానం

**- ఓహొ 369 హెల్త్ కార్డ్ ని కనిపెట్టిన తృష్ణ**

**45 నిమిషాలలో ప్రాణాలు కాపాడవచ్చు**

**ప్రతి ఒక్కరు ఈ కార్డు తీసుకుంటే అన్నివేళలా సురక్షిత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ లో విశ్వ ఆర్ట్స్ అండ్ మన కళా క్షేత్రం ఆధ్వర్యంలో కె ఎల్ యూనివర్సిటీ, బిసిఏ మూడవ సంవత్సరం విద్యార్థిని తిరునగరి తృష్ణ కు టాలెంట్ ఐకాన్ అవార్డు ప్రదానం చేశారు. తిరునగరి తృష్ణ కె ఎల్ యూనివర్సిటీ అజీజ్ నగర్ లో బిసిఏ ఫైనల్ ఇయర్ చదువుతూ ఒక గొప్ప ఆవిష్కరణ చేసింది. అదే "ఓహొ 369 హెల్త్ కార్డ్". తృష్ణ కనిపెట్టిన హెల్త్ కార్డ్ నేటి సమాజం లో ముఖ్యంగా యువత ప్రాణాలను కాపాడుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ప్రస్తుతం నిత్యం మన కళ్ళముందు జరిగే యాక్సిడెంట్ లు, మెడికల్ ఎర్రర్ డెత్ లు, ఆకస్మిక హార్ట్ ప్రాబ్లమ్స్, జరిగినప్పుడు సకాలంలో వైద్యం అందడం లో ఆలస్యం జరిగి ప్రతి సంవత్సరం లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందుకు కారణం ఒక్కటే యాక్సిడెంట్ అయిన ప్రదేశానికి అంబులెన్సు రావడానికి కనీసం 20 నుండి 30 నిముషాలు పడుతుంది. అంబులెన్సు దగ్గరలోని హాస్పిటల్ కి చేరడానికి 20 నిముషాలు పడుతుంది. బ్లడ్ గ్రూప్ తెలుసుకోడానికి 15 నిముషాలు పడుతుంది. తరువాత మెడికల్ ట్రీట్మెంట్ కోసం మెడికల్ రియాక్షన్స్ తెలుసుకోడానికి కనీసం రెండు గంటలు పడుతుంది. పెషేంట్ కి పూర్తి ట్రీట్మెంట్ అందడానికి 3 నుండి 4 గంటల సమయం పడుతుంది. అంతసేపు పేషంట్ బ్రతకడం కేవలం దైవాధీనం మాత్రమే. కాని ఇప్పుడు తిరునగరి తృష్ణ ఆవిష్కరించిన ఓహొ 369 హెల్త్ కార్డ్ పెషేంట్ దగ్గర ఉంటే అందులో సదరు వ్యక్తి హెల్త్ డేటా ం బ్లడ్ గ్రూప్ ం మెడికల్ ప్రాబ్లమ్స్ ం మెడిసిన్ రియాక్షన్స్ ఒక్క క్లిక్ తో మెడికల్ స్కాన్ చేసి కేవలం 45 నిమిషాలలో ప్రాణాలను కాపాడవచ్చు అన్నారు. విశ్వ ఆర్ట్స్ అండ్ మన కళా క్షేత్రం అంగ రంగ వైభవంగా నిర్వహించిన గురుపూజ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి బూర్గుల మధు సూదన్, డాక్టర్ జె. ఎన్. రాజేంద్ర, డాక్టర్ సృజన, డాక్టర్ ఎం. నాగూర్, డాక్టర్ ఎన్. బిక్కు నాథ్, డాక్టర్ వి. బి వసంత రాయ్ ల చేతుల మీదుగా తిరునగరి తృష్ణ టాలెంట్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి యువత కేవలం చదువుకే అంకితం కాకుండా తిరునగరి తృష్ణ ను అనుసరిస్తూ వారి వారి టాలెంట్ ను బయటకు తీయాలని ఇందుకు కాలేజీ ప్రొఫెసర్ లు, యాజమాన్యం, విద్యార్థుల తల్లి దండ్రుల ప్రోత్సాహం నేటి యువతకు చాలా అవసరం అన్నారు. ప్రతి యువత తిరునగరి తృష్ణ లా ఆలోచిస్తే యువత లో చైతన్యం కలిగి సమాజం లో నేరాలరేటు తగ్గుతుందని విద్యార్థులకు ఉన్నత విలువలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ గురువులు ఘంటసాల పవన్ కుమార్, జంద్యాల రమణి, యలమంచిలి ఉదయ్ కిరణ్, బలగం సినిమా పవిత్ర, సినీ స్క్రిప్ట్ రైటర్ టి. వి. స్వామి, రవీంద్ర, శర్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

# అభినయ కృష్ణ డైరెక్షన్ లో 'కామాఖ్య'



సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ డైరెక్షన్ లో ఓ థ్రిల్లింగ్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాకి కామాఖ్య అనే పవర్ ఫుల్ టైటిల్ ఫిక్స్ చేశారు. డివైన్ వైబ్ తో వున్న టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. డైరెక్టర్ అభినయ కృష్ణ జబర్దస్త్ లో అదిరే అభి పేరుతో తెలుగు ప్రేక్షకులందరికీ పరిచయమే. ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు అభి. ఈ సినిమాలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్యాని సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాకి సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

# స్పిరిట్.. మోస్ట్ అవైటెడ్ అప్‌డేట్



ఇండియాలో బిగ్గెస్ట్ స్టార్‌గా అవతరించినా.. చేస్తున్నవన్నీ భారీ చిత్రాలే అయినా.. మంచి స్పీడుతో సినిమాలు లాగిస్తూ ముందుకు దూసుకెళ్తున్నాడు రెబల్ స్టార్ ప్రభాస్. గతేడాది కల్కి సినిమాతో పలకరించిన ప్రభాస్.. ఈ ఏడాది చివర్లో రాజా సాబ్‌తో ఆడియన్స్ ముందుకు రాబోతున్నాడు. ప్రస్తుతం ప్రభాస్ హను రాఘవపూడి డైరెక్షన్ లో ఫౌజీ మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాలన్నింటికన్నా ప్రభాస్ ఫ్యాన్స్ ఇంట్రెస్ట్ స్పిరిట్ మీదే ఉంది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్.. ఇలా తీసిన మూడు సినిమాలతోనూ ప్రకంపనలు రేపిన సందీప్ రెడ్డి వంగ.. ప్రభాస్‌తో ఎలాంటి సినిమా తీస్తాడు.. వీరి కాంబినేషన్ ఎలా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది అని క్యూరియాసిటీతో చూస్తున్నారు ఫ్యాన్స్. అయితే సినిమా అనౌన్స్ అయి రెండేళ్లు దాటినా.. ఇంకా సెట్స్ మీదికి మాత్రం వెళ్లలేదు. షూటింగ్ ఇదిగో అదిగో అంటున్నారు కానీ.. ఎంతకీ సినిమా మొదలు కావడం లేదు. అయితే రీసెంట్ గా విజయ దేవరకొండ కింగ్ డమ్ ప్రమోషన్ ప్రోగ్రామ్ లో పాల్గొన్న సందీప్ రెడ్డి స్పిరిట్ పై అప్ డేట్ ఇచ్చేశాడు. సెప్టెంబరు చివరి వారం నుంచి షూటింగ్ ఉంటుందని క్లారిటీ ఇచ్చేశ్డిడు. ఇక అప్పట్నుంచి నాన్ స్టాప్‌గా కుమ్మేయడమే అంటూ చెప్పుకొచ్చాడు సందీప్. సెప్టెంబరులో షూటింగ్ మొదలుపెట్టి నాన్ స్టాప్‌గా షూటింగ్ జరిగిందంటే ఇంకో ఏడాదిలో సినిమా రిలీజైపోవచ్చు. అంటే 2026 చివర్లో స్పిరిట్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయన్నమాట. ఇది డార్లింగ్ ఫ్యాన్స్ బూస్ట్ నిచ్చే విషయం.

# అన్యాయంగా ఐరెన్ లెగ్ ట్యాగ్ వేశారు: శృతి హాసన్



కెరీర్ స్టార్టింగ్ లో రెండు మూడు ఫ్లాపులు పడ్డాయంటే చాలు.. హీరోయిన్ల మీద ఐరెన్ లెగ్ ముద్ర పడిపోతుంది. కానీ ఆ ట్యాగ్ హీరోలకు మాత్రం ఇవ్వరు. హీరోయిన్లే ఈ విషయంలో బాధితులుగా ఉంటారు. తర్వాత వాళ్లకు అవకాశాలు రావడం కష్టమవుతుంది. కమల్ హాసన్ కూతురైన శృతి హాసన్ కూడా కెరీర్ ఆరంభంలో ఇదే ప్రాబ్లెమ్ ఫేస్ చేసింది. కాకపోతే ఆమెకు అవకాశాలు మాత్రం ఆగలేదు. అనగనగా ఓ ధీరుడు, ఓ మై ఫ్రెండ్ సినిమాలతో చేదు అనుభవాలు ఎదుర్కొన్నప్పటికీ.. శృతి గబ్బర్ సింగ్ చిత్రంలో ఛాన్స్ వచ్చింది.

ఆ సినిమా బ్లాక్ బస్టర్ కావడంతో ఆమె వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేక్నుండా పోయింది.తర్వాత ఆమెను గోల్డెన్ లెగ్ అని కూడా అన్నారు. తనపై వచ్చిన ఈ రెస్పాన్స్ పై లేటెస్ట్ గా శృతి ఓపెన్ అయింది. తన తొలి రెండు సినిమాల్లో హీరో ఒకరే అయినప్పటికీ.. ఐరెన్ లెగ్ ముద్ర తనకు మాత్రమే ఆపాదించారని ఆమె వాపోయింది. కానీ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ మాత్రం ఇదేమీ పట్టించుకోకుండా గబ్బర్ సింగ్‌లో తనకు అవకాశం ఇచ్చారని ఆ సినిమా పెద్ద హిట్టవడంతో తన కెరీర్ మారిపోయిందని చెప్పింది.

తనకు ఐరెన్ లెగ్ మాత్రమే కాదు గోల్డెన్ లెగ్ అనే బిరుదు కూడా వద్దని.. తాను ఒక మామూలు మనిషిని, నటిని అని చెప్పుకొచ్చింది. అలాగే తన కెరీర్ మరో ఫ్లాప్ మూవీ అయిన 3 సినిమా టైంలో ఓటీటీ, పాన్ ఇండియా సినిమా అనేవి ఉంటి .. ఆ సినిమా ఎక్కడికో వెళ్లేదని చెప్పింది. ఒకవేళ ఇప్పుడు రీరిలీజ్ అయినా ఆ సినిమా బ్లాక్ బ్లస్టర్ అవుతుందని పక్కా కాన్ఫిడెంట్ తో చెబుతోంది. ప్రస్తుతం కూలీ సినిమాలో నటిస్తోంది శృతి. ఇందులో తను సత్యరాజ్ కూతురి పాత్రలో నటించానని.. తన కెరీర్లో అది స్పెషల్ రోల్ అని రివీల్ చేసిందీ బ్యూటీ.

# నెటిజన్ కు నిధి అదిరిపోయే ఆన్సర్ !

'హరి హర వీరమల్లు' సినిమాతో మళ్లీ ఫామ్ లోకి వచ్చిన టాలీవుడ్ బ్యూటీ నిధి అగర్వాల్. దాదాపు 5 ఏళ్లు పాటు తెరకెక్కిన ఈ మూవీకి ప్రస్తుతం మిక్స్ టాక్ నడుస్తోంది. దీంతో ఇన్నాళ్లు ఈ మూవీ కోసమే కమిటెడ్ గా ఉన్న నిధి.. ఆశలు ఇప్పుడు రాజాసాబ్ పై ఉన్నాయి. చాలామంది సోషల్ మీడియాలో వీఎఫ్ఎక్స్ పై ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే మూవీ యూనిట్ మాత్రం ఇప్పటికే సక్సెస్ మీట్ కూడా నిర్వహించింది. కలెక్షన్లు మాత్రం బాగానే ఉన్నాయని సినీ వర్గాలంటున్నాయి. మరోవైపు థియేటర్లను సైతం విజిట్ చేస్తూ సందడి చేస్తుంది. అందులో భాగంగానే నిర్మాత ఏఎం రత్నంతో కలిసి.. నిధి ఓ థియేటర్ కి వెళ్లిన వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే ఆ పోస్టుకి ఆ నెటిజన్ మాత్రం సినిమా నాకు నచ్చలేదు అంటూ కామెంట్ చేశాడు. అందుకు నిధి తనదైన శైలిలో రిప్లై ఇవ్వడం టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. అతని కామెంట్ కు ఏమాత్రం సీరియస్ అవ్వకుండా చాలా సింపుల్ గా రిప్లై ఇచ్చింది. పర్లేదు అండి.. అన్ బయాస్ గా ఉండే ప్రేక్షకులకు మూవీ నచ్చుతుంది అంటూ స్వీట్ కౌంటర్ ఇచ్చింది. దీంతో ఈ పోస్ట్ ఫుల్ వైరల్ అవుతోంది.



# పచ్చబొట్టు చెరిగిపోలేదులే




టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సమంత ఈమధ్య సినిమాల కన్నా కూడా వేరే విషయాల్లోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. రాజ్ నిడిమోరుతో సమంత ప్రేమాయణం నడుపుతుందని, త్వరలో అతనిని రెండో వివాహం చేసుకోనుందని జోరుగా గాసిప్స్ వస్తున్ష్నయి. ఈ బ్యూటీ తన టాటూలని ఒక్కొక్కటిగా చెరిపేసుకుంటుందనే టాక్ కూడా ఉంది. సమంత వీపు పై భాగంలో వైఎంసీ అనే టాటూ ఉంటుంది. ఇది ఏ మాయ చేసావే సినిమాకు గుర్తుగా వేయించుకోగా, ఈ సినిమా సమయంలోనే ఇద్దరి మధ్య బాండింగ్ బలపడిందని అంటారు. అయితే ఆమధ్య కాలంలో ఆ టాటూ సమంత వీపుపై కనిపించలేదు. అది చెరిపేసిందని అందరు అనుకున్నారు. కానీ లేటెస్ట్ గా ఈబ్యూటీ చీరకట్టి, స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి ఫొటో షూట్ చేసింది. ఓ ఫొటోలో తన వీపుపై వైఎంసీ టాటూ కనిపించడంతో సమంత ఆ టాటూ చెరిపేయలేదని, అది అలానే ఉందని అంటున్నారు. ఈ ఫొటోలతో ఫుల్ క్లారిటీ వచ్చినట్లైంది.

# మెస్మరైజ్ చేస్తున్న తేజ సజ్జా 'మిరాయ్'



హనుమాన్ సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న సూపర్ హీరో తేజ సజ్జా, ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేసిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్'లో నటిస్తున్నాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ మూవీ గ్లింప్స్, టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. మొదటి సింగిల్ 'వైబ్ ఉంది' ప్రోమో సూపర్ అని టాలీవుడ్ టాక్. తేజా సజ్జా ప్రతి ఫ్రేమ్‌లో ఎనర్జీ, ఛార్మ్, డాన్స్ స్టెప్స్ తో అదరగొట్టాడు. తేజ-రితికా నాయక్ కెమిస్ట్రీ, డాన్స్ మూమెంట్స్ అదిరిపోయింది. మొత్తానికి ట్రెండీ టచ్‌తో పాటు చిన్న క్లాసికల్ హింట్స్‌తో వైబ్ ఉంది పాట మాస్‌ని, క్లాస్‌ని రెండిటినీ కనెక్ట్ చేస్తోంది. మనోజ్ మంచు ఈ సినిమాలో పవర్ ఫుల్ విలన్‌గా కనిపించబోతున్నారు. శ్రీయ శరణ్, జయరామ్, జగపతిబాబు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మిరాయ్ దర్శకత్వం వహించడమే కాకుండా, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అలాగే స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించారు. సెప్టెంబర్5నఈ సినిమా వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కాబోతుంది.

# 'ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్' మూవీ టైటిల్ రివీల్





గ్లోబల్ స్టార్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఒక మూవీ తెరకెక్కుతుంది. ఈ సినిమాలో కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా.. రవి బస్రుర్ మ్యూజిక్ అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్ పై ఈ మూవీని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. రీసెంట్ గానే ఈ మూవీ షూటింగ్ షురూ చేశారు. జూన్ 25, 2026 న మూవీ విడుదల కాబోతుంది. ఈ సినిమా కోసమే ఎన్టీఆర్ బక్కచిక్కారు. సుమారుగా 18 కేజీల బరువు తగ్గి అందరికీ షాక్ ఇచ్చారు. ఈమధ్య ఎన్టీఆర్ ఈ లుక్ లో కనిపించగా అతని ఫ్యాన్స్ మరీ వీక్ అయిపోయారంటూ కంగారు పడ్డారు కూడా. ఈ మూవీ టైటిల్ ఇంకా రివీల్ చేయకపోయినా.. టైటిల్ ఇదేనంటూ పలు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే లేటెస్ట్ గా ఎన్టీఆర్ నీల్ సినిమా టైటిల్ ను మలయాళ స్టార్ హీరో పృధ్వీరాజ్ సుకుమారన్ రివీల్ చేసేశారు. ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్ తో 'డ్రాగన్' అనే సినిమా చేస్తున్నాడని.. ఈ సినిమాలో మలయాళ సీనియర్ నటులు బిజూ మీనన్.. యంగ్ హీరో టోవినో థామస్ నటిస్తున్నారని తెలిపారు పృధ్వీరాజ్. వారిద్దరికీ ఇంపార్టెంట్ రోల్ ఉంటుందని భావిస్తున్నానని అన్నారు. సినిమా మీరు ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉంటుందని చెప్పుకొచ్చారు. ఓ వైపు ఆర్ఆర్ఆర్, దేవర చిత్రాలతో ఫుల్ ఫామ్ లో ఉన్నారు తారక్. మరోవైపు కేజీఎఫ్, కేజీఎఫ్ 2, సలార్ చిత్రాల్లో హ్యాట్రిక్ హిట్లు కొట్టిన ప్రశాంత్ నీల్ ఉన్నారు. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్ లో సినిమా రాబోతుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

# పవన్ కల్యాణ్‌తో విభేదాల్లేవు.. కుదిరితే మళ్లీ సినిమా చేస్తా



'హరిహర వీరమల్లు' నుంచి తప్పుకోడానికి గల కారణాలు త్వరలోనే తెలుస్తాయన్నారు డైరెక్టర్ క్రిష్. ఈ సినిమా మొదట క్రిష్ డైరెక్షన్ లో మొదలైంది. ఆయన మధ్యలో తప్పుకోవడంతో జ్యోతికృష్ణ మూవీని పూర్తి చేశారు. గత ఐదేళ్లుగా రకరకాల కారణాల వల్ల వాయిదాలు పడుతూ వచ్చిన ఈ మూవీ ఎట్టకేలకి విడుదలైంది. క్రిష్ ఈ సినిమాని ఎందుకు వదిలేశాడాన్న అనుమానాలు చాలామందికి ఉన్నాయి. నిర్మాత, పవన్ కల్యాణ్ తో వచ్చిన విబేధాలే కారణమనే టాక్ కూడా ఉంది. దీనిపై క్రిష్ రెస్పాండయ్యాడు. ఈ ప్రాజెక్ట్ నుంచి మధ్యలో వెళ్లిపోవడానికి అసలు కారణాలు త్వరలోనే అందరికీ తెలుస్తాయంటూ క్లారిటీ ఇచ్చారు. తనకు పవన్ తో ఎలాంటి విభేదాలు లేవని, మా మధ్య క్రియేటివ్ డిఫరెన్స్‌లు కూడా లేవన్నారు. నేను ఓపెన్‌గా ఉన్నా... భవిష్యత్తులో పవన్ తో మళ్లీ సినిమా చేయడానికి సిద్ధంగా ఉన్నా.. అని కూడా క్రిష్ చెప్పారు. 'హరిహర వీరమల్లు' విడుదలకు ముందు కూడా క్రిష్ సోషల్ మీడియాలో పవన్, ఏఎం రత్నంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా పూర్తవ్వడానికి పవన్ కల్యాణ్, అలాగే నిర్మాత ఏఎం రత్నం ప్రధాన కారణాలు అంటూ పోస్ట్ కూడా చేశారు. అటు పవన్ కల్యాణ్ కూడా ప్రమోషన్ సమయంలో పవన్.. క్రిష్‌పై పలుమార్లు ప్రశంసలు కురిపించాడు.

# రిలీజ్ ముందే 'కింగ్‌డమ్' రికార్డ్స్



రౌడీ స్టార్ ఎప్పటినుంచో మంచి సక్సెస్ ఎదురుచూస్తున్నాడు. మంచి కమ్ బ్యాక్ ఇవ్వాలనే ఉద్దేశంతో 'జెర్సీ' ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో 'కింగ్‌డమ్' సినిమా చేశాడు. ఈ సినిమా కోసం అంతే ఎఫర్ట్ పెట్టి కష్టపడ్డాడు. ఈ మూవీ కోసం రౌడీ ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. ఈ సినిమాను కంప్లీట్ యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కించాడు గౌతమ్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పోస్టర్స్, సాంగ్స్, వీడియో గ్లింప్స్ కు ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఈ సినిమా విడుదలకు ముందే నయా రికార్డ్ క్రియేట్ చేసింది. కింగ్ డమ్ సినిమా ప్రీమియర్స్ ఈ నెల 30న జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన బుకింగ్స్ ఓపెన్ అవ్వగా 24గంటలు గడవక ముందే భారీగా అమ్ముడయ్యాయి. ఈ మేరకు ఓ పోస్టర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇక కింగ్ డమ్ సినిమా జూలై 31న వరల్డ్‌వైడ్ ప్యాన్‌ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది . ఈ సినిమాని హిందీలో 'సామ్రాజ్య' అనే టైటిల్‌తో రిలీజ్ చేస్తున్నారు.

# మాట నిలబెట్టుకున్న పుట్ట మధు

**- జ్యోత్స్నకు రూ.2లక్షల చెక్కు అందజేత.**

**భీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్.**



**కాటారం ( ప్రశ్న న్యూస్)** మంథని నియోజకవర్గంలోని కాటారం మండల కేంద్రానికి చెందిన గంట జ్యోత్స్న ఎంబీబీఎస్ కోర్సు పూర్తయ్యే వరకు ఖర్చులు భరిస్తానని మాట ఇచ్చిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తన మాట నిలబెట్టుకున్నారు. రెండు రోజుల క్రితం భీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బాగంగా గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ఏడాదికి ఖర్చు అయ్యే రూ. 2లక్షల సాయం అందిస్తానని జ్యోత్స్న కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం భూపాలపల్లి జిల్లా మొగుళ్ళ పల్లి మండలం ఇస్సిపేట గ్రామంలోనీ శ్రీ లక్ష్మీ సాయి గార్డెన్ లో గంట జ్యోత్స్నకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా రూ. 2లక్షల చెక్కు అందజేశారు. మాట ఇచ్చి తన భవిష్యత్‌కు బంగారు బాట వేసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు జ్యోత్స్న కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ జక్కు శ్రీహర్షిణి, రాకేష్ భీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల నిధుల మంజూరుకు విజ్ఞప్తి..!

# కేంద్రమంత్రి హామీ..!!

**- భాజపా ఎస్సీ మోర్చా జిల్లాధ్యక్షులు : సంటి మహేష్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఆదివారం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంటి మహేష్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల మంజూరు కోసం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ సానుకూలంగా స్పందించి,అవసరమైన నిధుల కేటాయింపుపై హామీ ఇవ్వడం జరిగింది. వారి వెంట భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లిఖార్జున్ ఉన్నారు.

# కౌశిక్ రెడ్డి పై మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్ హెచ్చరిక

**- సీఎం రేవంత్ రెడ్డి పై దుష్ప్రచారాలు మానుకో..!**

**- ఫోన్ ట్యాపింగ్ బిఆర్ఎస్ పార్టీ ఆచారం**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ ను ప్రజలు బొంద పెడతారు**

**- వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ : కనికరపు రాకేష్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి పై నిరాధార వ్యాఖ్యలు చేయడం ఆపాలని ఆయన హెచ్చరించారు.ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి, కెసిఆర్ – కేటీఆర్ – హరీష్ రావు దగ్గర పేరు సంపాదించుకోవడం కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాకేష్ విమర్శించారు.త్వరలో బీజేపీలో విలీనం కాబోయే పార్టీ కోసం అంత కష్టపడాల్సిన అవసరం లేదని ఆయన ఎద్దేవా చేశారు."ఇప్పటికైనా కౌశిక్ రెడ్డి తన తీరులో మార్పు తెచ్చుకోవాలి. లేనిపక్షంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖమ్మం గణేష్, వస్తాది కృష్ణ, సాబీర్, నాయకులు దాడి మల్లేశం, నాగుల రాము, గంటల ప్రకాష్, కుతాడి రాజేశం, కూర దేవన్న, అంబాటి చందు, నేరెళ్ల శ్రీధర్ గౌడ్, పోతుగంటి వెంకన్న, ఇన్నారం సాగర్, కుమ్మరి శేఖర్, సారంపెల్లి భాను, గుండం సంతోష్, జోగిని తిరుపతి, మహదేవుని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షా ల వలన ప్రజలు ఎవ్వరు కూడా ప్రాజెక్టులు, చెరువుల దగ్గర కు వెళ్ళరాదు

**అదనపు కలెక్టర్ నగేష్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఆదివారం హవేలీగాన్ పూర్ మండలం దూప్ సింగ్ తండా భారీ నీటి ప్రవాహం కారణంగా వాగు పొంగి పొర్లుతుంది.. రెవిన్యూ సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు వరద ఉధృతి ఉన్న దగ్గర హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, భారీ వర్షాలు వరదల వలన ప్రజలు చెరువులు దగ్గరకు వెళ్ళరాదని వరద పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే నివేదించాలని ప్రజలను ఎవరు కూడా అటువైపు వెళ్ళకుండా చూడాలన్నారు.ప్రస్తుతం దూప్ సింగ్ తండాకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని గురించి అధికారులు అడిగి తెలుసుకున్నారు.

# వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వనమహోత్సవం



వేములవాడ,(ప్రశ్న న్యూస్) దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాబాయి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానానికి చెందిన తిప్పాపూర్ గోశాల ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వయంగా వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి,వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, కార్యనిర్వాహక ఇంజనీర్,ఉప కార్యనిర్వాహక ఇంజనీర్, సహాయక ఇంజనీర్, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వనమహోత్సవం ద్వారా పచ్చదనం పెంపుతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## రాజన్న కోడెల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా**

**- ఆదివారం 85 జతల కోడెల పంపిణీ**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాల నుంచి రైతులు తీసుకున్న కోడల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ లో ఉన్న వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలోని 85 జతల కోడెలను 170 జీవాలను అర్హులైన రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కోడెల స్థితిగతులపై ఆరా తీస్తారని తెలిపారు. కోడెలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ రాజేశ్వర స్వామి ఆలయ ఇంచార్జి ఈఓ రాధాభాయి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్, సహాయక ఇంజనీర్, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారంటీలు అమలు చెయ్యాలి

**స్థానిక సమస్యలపై ఆగష్టు నెలలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం**

**సిపిఎం రాష్ట్ర పార్టీ సభ్యులు ఎం. అడివయ్య**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం చెందిందని సిపిఎం రాష్ట్ర పార్టీ సభ్యులు ఎం. అడివయ్య విమర్శించారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం కేవల్ కిషన్ భవన్లో సిపిఎం జిల్లా విస్తృత సమావేశం జరిగింది.ఈ సమావేశంకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయడానికి చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని అన్నారు.దేశంలో నిరుద్యోగం పెరుగుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు చేస్తామని అన్నారు.సామాజిక అసమానతలు పెరిగిపోతున్నాయని అన్నారు. విద్యా, వైద్యం పేదలకు అందకుండా పోతుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో 6 గ్యారంటీలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి19 నెలలు అవుతున్న అమలు చేయడంలో విఫలం చెందిందని మండిపడారు.మహిళలకు ఉచిత అర్టీటీసీ ప్రయాణం తప్ప మిగత హామీలను ఎందుకుఅమలుచేయలేదనిప్రశించారు.రైతంగానికి అవసరమైన ఎరువులను అందించడంలో విఫలం చెందిందని అన్నారు.పని గంటలు పెంచుతు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ఆగష్టు, సెప్టెంబర్ నెలలో ప్రజల సమస్యలపై గ్రామాలు, పట్టణాల్లో సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు.మెదక్ ఆగష్టు 4 నుండి 13 వరకు సర్వేలు నిర్వహించడంజరుగుతుందని, సర్వేలలో వచ్చిన సమస్యలపై ఎంపీడీఓ కార్యాలయల ముందు ధర్నా లు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి కే. నర్సమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. మల్లేశం, బాలమణి, కే. మల్లేశం, కార్యవర్గ సభ్యులు కదారి నాగరాజు, సంతోష్, గౌరీ ,అజెయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజమా..! నీ దారెటు?

**- బజారున పడుతున్న నాలుగో స్తంభం ప్రతిష్ట**

**- కనీస విద్యార్హత లేకపోవడం బాధాకరం**

**- సీనియర్ జర్నలిస్టు : వొడ్యాల వేణు**



వేములవాడ, (ప్రశ్న న్యూస్) సమాజ అభివృద్ధికి దోహదపడే మీడియా విలువలు క్రమంగా దిగజారుతున్నాయని, గౌరవప్రదమైన వృత్తిగా భావించే జర్నలిజం ప్రక్కదారి పడుతోందని సీనియర్ జర్నలిస్టు, "ప్రజాప్రశ్న జాతీయ దినపత్రిక" రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫర్ వొడ్యాల వేణు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టు కావాలనుకునే వారికి ప్రభుత్వం లేదా మీడియా యాజమాన్యాలు ఇప్పటివరకు కనీస విద్యార్హతను నిర్దేశించకపోవడం వృత్తి ప్రతిష్టను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. టార్గెట్లు పూర్తి చేస్తే సరిపోతుందని భావించే కొన్ని యాజమాన్యాల వల్ల అక్షరాస్యత లేని వారు కూడా రిపోర్టర్ ఐడీ కార్డులు పొందుతున్నారని, ఇది ప్రజల్లో జర్నలిజం ప్రతిష్టను నవ్వుల పాలుచేస్తోందని ఆయన విమర్శించారు.ఐడీ కార్డుల దుర్వినియోగం ద్వారా కొంతమంది సామాన్యులను, వ్యాపారులను బెదిరించడం, స్వలాభం పొందడం పరమావధిగా మార్చుకున్నారని వేణు ఆరోపించారు. ఈ దుస్థితి మిగిలిన నిజాయితీ జర్నలిస్టుల ప్రతిష్టను కూడా దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### కనీస విద్యార్హతతోనే అక్రిడిటేషన్ ఇవ్వాలి

స్వీపర్ ఉద్యోగానికి కూడా కనీస విద్యార్హతను నిర్దేశించగా, సమాజాన్ని ప్రభావితం చేసే జర్నలిస్టు ఉద్యోగానికి కనీస అర్హత లేకపోవడం ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం దృష్టి సారించి, మండల స్థాయి విలేకరికి ఇంటర్మీడియట్, జిల్లా స్థాయి విలేకరికి డిగ్రీని కనీస అర్హతగా నిర్దేశించి, ఆ అర్హత కలిగిన వారికే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా జీఓ జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిబంధన అమలు చేస్తే జర్నలిజం ప్రతిష్ట పెరగడంతో పాటు అర్హతలేని వ్యక్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని విడుదల చేసిన ప్రకటనలో వొడ్యాల వేణు స్పష్టం చేశారు.

# గ్రామ పాలన అధికారి , లైసెన్సెడ్ సర్వేయర్ పరీక్షలు ప్రశాంతం

**డిఆర్ఓ భుజంగరావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) పటిష్ట బందోబస్తు నడుమ పరీక్షకు సంబంధించిన మెటీరియల్ జేఎన్టీయూ హైదరాబాద్ కు తరలించడం జరిగిందిఆదివారం గ్రామ పాలన అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షా సెంటర్ ను డి ఆర్ వో భుజంగరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, సర్వే ల్యాండ్ ఏ.డి, సంబంధిత పోలీస్ యంత్రాంగం తో కలిసి డిఆర్ఓ భుజంగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ భుజంగరావు మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి , లైసెన్సెడ్ సర్వేయర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని,పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించామని. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించామన్నారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 73 మంది అభ్యర్థులకు గాను, 63 మంది హాజరయ్యారని, 10 మంది గైర్హాజరు అయినట్లు డిఆర్ఓ భుజంగరావు తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన పరీక్షకు113 మంది అభ్యర్థులకు గాను 105మంది హాజరయ్యారని,08 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు . లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించామని అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు తో పాటు ఎలాంటి కాపీ జరుగకుండా పరీక్ష ను సజావుగా జరిగిందన్నారు.పరీక్షా కేంద్రాల మెటీరియల్ను పటిష్ట బందోబస్తు నడుమ హైదరాబాద్ జెఎన్టుకు తరలించడం జరిగిందని ఆయన వివరించారు.

# రైతుల బోర్ మోటార్ల కేబుల్ చోరీ

**- వ్యవసాయ బోర్ల నుండి సుమారు 20 మోటార్ల కేబుల్ వైర్ చోరీ**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో వ్యవసాయ బోర్ మోటార్ల నుండి స్టార్టర్ డబ్బా వరకు ఉండే కేబుల్ ను కట్ చేసి ఎత్తుకెళ్లారు గతంలోను మూడు సార్లు పంట పొలాల వద్ద ఉన్న మోటర్లు,స్టాటర్లు దొంగిలించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. సుమారు ఒక్కో రైతు పదివేల రూపాయల వరకు నష్టపోయినట్టు చెబుతున్నారు దొంగతనం చేసిన వారికి ఎంతో కొంత మిగులుతుంది కానీ రైతులకు చాలా నష్టం ఇప్పటివరకు వర్షాలు లేక పంటలు వేసుకుందామంటే వరినారులు ముదిరిపోయి లబోది ఇవ్వమంటున్నారు. కేబుల్ దొంగతనం అదనభారంగా ఆందోళన చెందుతున్న రైతులు, ఈ దొంగతనంలో నష్టపోయిన రైతులు గడ్డం రాజేశ్వర్, కావేటి నరేందర్.

# మేడ మీద మేడ..
# అనుమతులు ఏడ.?

- మల్కాజ్‌గిరి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- నేరేడ్‌మెట్ డివిజన్‌లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు..
- అవినీతి అక్రమాలను పట్టించుకోని ఉన్నత అధికారులు



**మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. "మేడ మీద మేడ అనుమతులు ఏడ" అన్న చందంగా.. కళ్లకు స్పష్టంగా కనిపిస్తున్న అనుమతులు లేని నిర్మాణాలను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని స్వాగత్ ఫంక్షన్ హాల్ సమీపంలోని మధురానగర్ కాలనీ ప్రధాన రహదారి పక్కనే అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న అక్రమ నిర్మాణాలకు మల్కాజ్‌గిరి సర్కిల్ ఇప్పుడు అడ్డాగా మారిందనే అపవాదు మూటగట్టుకుంటోంది. నిబంధనలకు విరుద్ధంగా అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తున్నా, వాటిని అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కిందిస్థాయి సిబ్బంది నుండి ఉన్నతాధికారుల వరకు అందరూ చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున 'చేతులు తడపడం' జరుగుతోందని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను, భవన నిర్మాణ చట్టాలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న ఈ అక్రమ నిర్మాణాలు భవిష్యత్తులో ప్రజల భద్రతకు పెను ప్రమాదంగా మారే అవకాశం పలువురు హెచ్చరిస్తున్నారు.

స్థానిక కార్పొరేటర్లు, నాయకులు కూడా ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా, అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈ అక్రమ నిర్మాణాల వల్ల డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధికారులు తక్షణమే స్పందించి అనుమతులు లేని నిర్మాణాలపై తగినచర్యలు తీసుకోని బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నిన్నైనా, రేపైనా బీసీలకు
# న్యాయం చేసేది కేసీఆర్ ఒక్కరే

- పరిశ్రమలు తెలంగాణ వదిలి పారిపోయే పరిస్థితి ఉందన్న కేటీఆర్
- కాకతీయ టెక్స్‌టైల్స్ పార్క్ హైటెక్ సంస్థ ను కాంగ్రెస్ నాయకుల బెదిరిస్తున్నారు



**వరంగల్ (ప్రశ్న న్యూస్)** గతంలో బీసీలకు న్యాయం చేసింది, రేపు కూడా వారికి ప్రాధాన్యత ఇచ్చేది కేసీఆర్ మాత్రమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పరకాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేటీఆర్ మహిళలకు కుట్టు మిషన్లు, కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన మెజారిటీలతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సెట్ అవుతారని చెప్పారు.

### కాంగ్రెస్ బెదిరింపులతో పరిశ్రమలు పారిపోయే పరిస్థితి

'దేశంలోనే అతిపెద్ద కాకతీయ టెక్స్ టైల్ పార్క్ లో 25000 మందికి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన కీటెక్స్ సంస్థను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారు. వారు చెప్పిన వారికే ఉద్యోగాలు ఇవ్వాలన్న కాంగ్రెస్ బెదిరింపులతో పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి పారిపోయే పరిస్థితి దాపురించింది. కాకతీయ టెక్స్ టైల్ పార్కులో కాలువ నిర్మాణానికి జనవరిలో రూపొందించిన 137 కోట్ల అంచనాలు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల ధనదాహంతో 297 కోట్లకు పెరిగింది. కాలువ నిర్మాణం పేరుతో వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు 167 కోట్లు దోచుకోవాలనుకున్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు కు పరిశ్రమలను తెప్పించి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని బీఆర్ఎస్ అనుకుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దాన్ని నిలువు దోపిడి చేసే కుట్రలు చేస్తున్నారు. ప్రశ్నించకపోతే కాంగ్రెస్ నేతలు చేస్తున్న దోపిడీ ఆగదని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో వారి అక్రమాలపై నిలదీస్తాం' అన్నారు కేటీఆర్.

### టైంకి యూరియా ఎరువులు ఇవ్వలేని రేవంత్ సర్కార్..

ప్రతీ ఆడబిడ్డకు తెలంగాణలోని ప్రభుత్వం 50 వేలు బాకీ ఉన్నది. చారాణ కోడికి బారాణ మసాలా అన్నట్టు స్వయం సహాయక బృందాలకు 3000 కోట్ల రూపాయలకు బదులు రేవంత్ ప్రభుత్వం కేవలం 300 కోట్లు ఇచ్చి సంబరాలు చేసుకోవాలంటోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులకు సమ్మక్క- సారక్క, రాణి రుద్రమ వారసురాళ్లయిన వరంగల్ ఆడబిడ్డలు కర్రు కాల్చి వాత పెట్టాలి. మొన్న పార్లమెంటు ఎన్నికలప్పుడు రైతుబంధువేసి ఇప్పుడు పంచాయతీ ఎలక్షన్స్ ఉన్నాయని మళ్లీ రైతుబంధు వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ కండువా కప్పుకుని మీ ఇంటికి వచ్చే బీఆర్ఎస్ క్యాడర్ ను కేసీఆరే వచ్చిండని భావించి కడుపులో పెట్టుకొని ఆశీర్వదించండి. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రభుత్వం జనవరిలోనే ఎరువులు కొని బఫర్ స్టాక్ చేసుకునేది. అందుకే ఆయన సిఎంగా ఉన్నన్ని రోజులు యూరియా దుకాణాల ముందు లైన్లో చెప్పులు, ఆధార్ కార్డులు కనిపించలేదు. టైంకి ఎరువులు, విత్తనాలు, యూరియా ఇవ్వలేని రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రికి పదవిలో ఉండే అర్హత లేదు.

### లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నాడు. పరకాల నియోజకవర్గంలో ఇండ్లు నిర్మించుకున్న 3 వేల మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సతాయిస్తున్నది. లబ్ధిదారుల తరపున పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి కోర్టుకు పోతే, న్యాయస్థానం చెప్పినా కూడా రేవంత్ ప్రభుత్వం స్పందించడం లేదు. 3000 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు న్యాయం జరిగేదాకా పోరాడుదాం. అసెంబ్లీలో కొట్లాడుతాం. తెలంగాణ షాన్ గా ఉన్న ఆజం జాహీ మిల్లు సమైక్య పాలనలో మూతపడింది. నాటి సమైక్య పాలకులు ఆజం జాహి మిల్లు భూములను అడ్డకి పావు సేరు అమ్ముకున్నారు. ఆజం జాహి మిల్లు మూతపడడంతో వరంగల్ జిల్లాలోని పద్మశాలీలు బతుకుదెరువు కోసం భీమండి, సూరత్, షోలాపూర్, వలస పోయారు. అలా వలస పోయిన వాళ్లందర్నీ స్వరాష్ట్రంలో తిరిగి వెనక్కి తెప్పించుకుంటామని ఉద్యమ కాలంలో కేసీఆర్ గారు చెప్పారు. అందుకు అనుగుణంగానే తెలంగాణ వచ్చాక ఇదే వరంగల్ గడ్డపై 1500 ఎకరాల్లో భారత దేశంలోనే అతిపెద్ద కాకతీయ టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేశారు.

### కేసీఆర్ హయాంలో కార్మికుల కోసం షెడ్లు

బీఆర్ఎస్ ప్రభుత్వ చిత్తశుద్ధి, పట్టుదల, నిజాయితీ కారణంగా కేరళకు చెందిన కీటెక్స్ సంస్థ 2400 కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టింది. దాంతో పాటు యంగ్ వన్ అనే కొరియా సంస్థ, గణేష్ ఎకో అనే బొంబాయి సంస్థ కూడా పెట్టుబడులు పెట్టడంతో 2022- 23 నాటికి ఒక టెక్స్ టైల్ పార్క్ లో ఒక యూనిట్ ను ప్రారంభించాం. శిక్షణ పొందుతున్న ఆడబిడ్డలకు కాకతీయ టెక్స్ టైల్ పార్కులో ఉద్యోగాలు వచ్చే బాధ్యత తీసుకుంటాము. శ్రామికులుగా సూరత్ కు వలస పోయిన కార్మికులను తిరిగి పారిశ్రామికులుగా తెలంగాణకు రప్పించేందుకు కేసిఆర్ సీఎంగా ఉన్నప్పుడు మడికొండలో 100 ఎకరాల్లో ఏర్పాటుచేసిన షెడ్లు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో నిరుపయోగంగా మారాయని' కేటీఆర్ ఆరోపించారు.

## లోక్ సభలో ఆపరేషన్
# సింధూర్ పై చర్చ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** లోక్‌సభలో ఆపరేషన్ సింధూర్ పై సోమవారం నుంచి చర్చ జరగనుంది. ఈ డిస్కషన్ కోసం కేంద్ర ప్రభుత్వం 16 గంటల టైమ్ కేటాయించింది. ప్రధాని నరేంద్రమోడీ కూడా ఆపరేషన్ సింధూర్‌పై జరిగే చర్చలో పాల్గొంటారు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లోక్ సభలో డిస్కషన్ ను ప్రారంభిస్తారు. అటు రాజ్యసభలోనూ సింధూర్ పై డిస్కస్ చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాజ్యసభలో ఈనెల 29 నుంచి 9 గంటల పాటు ఆపరేషన్ సింధూర్‌పై డిస్కషన్ జరుగుతుంది. కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన క్రెడిట్ గా చెప్పుకోవడంపై ప్రధాని సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇప్పటికే చాలాసార్లు డిమాండ్ చేశారు. అలాగే భారతీయ బలగాలు ఎన్ని విమానాలు కోల్పోయో కూడా అడుగుతున్నారు. అందువల్ల పార్లమెంట్ లో ఆపరేషన్ సింధూర్‌పై హాట్ హాట్ డిస్కషనే జరిగే ఛాన్సుంది.

## హరిద్వార్ తొక్కిసలాటలో
# ఆరుగురు మృతి



**హరిద్వార్ (ప్రశ్న న్యూస్)** హరిద్వార్‌లో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి కారణం ఏంటి? లక్షలాదిగా భక్తులు ఎందుకు తరలి వచ్చారు? అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పవిత్ర శ్రావణ మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్ లో ఉన్న మానసాదేవి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అయితే.. ఇంత మంది భక్తులకు సరైన ఏర్పాట్లు చేయలేక పోవడం ఒక సమస్య అయితే.. ఇంతలోనే.. లైన్‌లో ఉన్న భక్తులకు ఎక్కడో విద్యుత్ షాక్ తగిలి.. పలువురు భక్తులు కింద పడిపోయారన్న వార్త చెవిలో పడింది. అంతే.. ఒక్కసారిగా భక్తులు క్యూలైన్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో తొక్కిస లాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. గాయపడినవారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మవిద్యుత్ షాక్ కారణంగా భయభ్రాంతులకు గురైన భక్తులు ఒక్కసారిగా పరుగులు పెట్టడంతో తొక్కిసలాట జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే.. అసలు విద్యుత్ షాక్‌కు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

# హైదరాబాద్‌లో రేవ్ పార్టీ భగ్నం..
# భారీగా డ్రగ్స్ స్వాధీనం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నగరంలోని హైటెక్ సిటీ సమీపంలోని కొండాపూర్‌లో మరోసారి రేవ్ పార్టీ కలకలం రేపింది. ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. ఈ దాడిలో 11 మందిపై కేసు నమోదు కాగా, 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. పోలీసుల దాడిలో స్వాధీనం చేసుకున్న వాటిలో 2 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్ డ్రగ్, 11.57 గ్రాముల మ్యాజిక్ మష్రూమ్, 1.91 గ్రాముల చెరాస్ డ్రగ్స్ తో పాటు 6 కార్లు ఉన్నాయి. పార్టీలో వినియోగం కోసమే ఈ డ్రగ్స్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. నిందితులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించగా, కేసును అక్కడికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఎక్సైజ్ అధికారులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విజయవాడకు చెందిన వాసు, శివం రాయుడు అనే ఇద్దరు వ్యక్తులు ఈ రేవ్ పార్టీలను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీరు ఒక ముఠా తరహాలో ప్లాన్ ప్రకారం ఈ పార్టీలను ప్లాన్ చేస్తూ, ఇతరుల ఆధార్ కార్డులు, ఐడీలు ఉపయోగించి తమ అసలు గుర్తింపును దాచిపెట్టే ప్రయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో ఈ తరహా పార్టీలకు చోటు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588